E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం



114 రఫేల్ జెట్ల ఒప్పందం ఖరారు! » 3లో

హైదరాబాద్ (తేదీ) 09-02-2026 (వారం) సోమవారం సంపుటి: 02 || సంచిక: 39 || పేజీలు–6 www.ekaburu.com



2

## బంగ్లా జైలులో మాజీ ఎంపీ రమేశ్ చంద్రసేన్ మృతి

ఈ-కబురు,ఢాకా: బంగ్లాదేశ్‌లోని దినాజ్‌పుర్ సెంట్రల్ జైలులో అవామీ లీగ్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి రమేశ్ చంద్రసేన్ (85) మృతి చెందారు. ఐదు సార్లు పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైన సేన్.. 2024 ఆగస్టు 16 నుంచి జైలులోనే ఉన్నారు. షేక్ హసీనా ప్రభుత్వం రద్దైన వెంటనే ఆయనపై జమాత్-ఎ-ఇస్లామీ, బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ కార్యకర్తలు దాడి చేశారు



3

## మెగా చినాబ్ డ్యామ్ ప్రాజెక్ట్ వేగవంతం

ఈ-కబురు, న్యూఢిల్లీ : ముష్కర మూకల దాడులతో పేట్రేగిపోతున్న పాకిస్తాన్‌కు బుద్ధిచెప్పే లక్ష్యంతో పాకిస్తాన్ జల జీవనాడిని దెబ్బకొట్టాలని మోదీ సర్కార్ నిర్ణయించింది. ఇందులోభాగంగా సరిహద్దు ప్రాంతాల్లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మెగా చినాబ్ డ్యామ్ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టింది.



2

## కమ్యూనిస్టుల భావజాలమే విధ్వంసకరం

దాన్ని దేశం త్వరగా వదిలించుకోవాలి: అమిత్‌షా

ఈ-కబురు, రాయ్‌పుర్: భద్రతను దృష్టిలో ఉంచుకుని వ్యూహాలు రూపొందించడం, మౌలికవసతుల కల్పన, మావోయిస్టుల ఆర్థిక మూలాలను దెబ్బకొట్టడం తదితర చర్యలతో వామపక్ష తీవ్రవాదం నడ్డి విరిచామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు.




# జిల్లాలను రద్దు చేయం.
# కొత్తవి ఏర్పాటు చేయం

- భూపాలపల్లి జిల్లా చెల్పూరు ప్రజాపాలన–ప్రగతిబాట సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- జిల్లాల పునర్విభజన చేయాల్సి వస్తే అసెంబ్లీలో చర్చిస్తాం
- బీఆర్ఎస్ అంటే బ్లాక్‌మెయిల్ రాజకీయ సమితి...
- ఇక నుంచి అలాగే పిలుస్తా.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌ను అరెస్ట్ చేసే వరకూ కిషన్‌రెడ్డి కల్వకుంట్ల కిషన్‌రావే
- సింగరేణిపై బీఆర్ఎస్ విష ప్రచారం.. మెడికల్ బోర్డు రద్దు ఆలోచన లేదు

ఈ-కబురు, వరంగల్:

'పాత జిల్లాల మార్పు..కొత్త జిల్లాల ఏర్పాటుపై కొందరు విష ప్రచారం చేస్తున్నారు. జిల్లాలను తీసివేయం.. కొత్త జిల్లాలను ఏర్పాటు చేయం.. ఒకవేళ జిల్లాల పునర్విభజన చేయాల్సి వస్తే అసెంబ్లీలో చర్చకు పెడతాం. ప్రతిపక్ష పార్టీల అభిప్రాయాలను తీసుకుంటాం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

అబద్ధాలతో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్న వారిని నమ్మొద్దని, భూపాలపల్లి జిల్లా ఎటూపోద ని.. జిల్లాల మార్పులపై ఎవరూ అపోహ పడొద్దని చెప్పారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఆదివారం నిర్వహించిన ప్రజాపాలన-ప్రగతి బాట కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. హెలికాప్టర్‌లో మంత్రులు పొంగులేటి శ్రీనివా స్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖతో ముందుగా రేగొండ మండలం కొడవటంచ గ్రా మానికి చేరుకున్న సీఎం.. శ్రీ లక్ష్మీనరసింహస్వా మిని దర్శించుకున్నారు. అక్కడ రూ.63 కోట్లతో ఆలయ పునరుద్ధరణ, గెస్ట్‌హౌస్ నిర్మాణ పనులను సురేఖ చేతుల మీదుగా ప్రారంభిం చారు. అనంతరం చెల్పూరులో ఏర్పాటు చేసిన 'ప్రజాపాలన-ప్రగతి బాట'బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. జిల్లాల పునర్విభజ నపై అందరి అభిప్రాయాలు తీసుకొని, అసెంబ్లీ లో చర్చించిన తర్వాతే దీనిపైన ఆలోచిస్తామని, కుట్రలు, కుతంత్రాలతో విష ప్రచారం చేస్తున్న వారిని గమనించాలని పునరుద్ఘాటించారు.

తరువాయి 2లో

# ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాల్లేవు

- రాజీ పడకుండా పోరాడతాం
- వ్యూహాత్మక రంగాల్లో మలేసియాతో బంధాలు
- ఇండో-పసిఫిక్‌లో శాంతి-సుస్థిరతకు కట్టుబడి ఉన్నాం: మోదీ
- 11 ఒప్పందాలపై సంతకాలు



ఈ-కబురు, కౌలాలంపూర్:

ఉగ్రవాదంపై తమ సందేశం విస్పష్టమని, దానిలో ద్వంద్వ ప్రమాణాలకు/ రాజీకి తావే లేదని భారత ప్రధాని నరేంద్రమోదీ స్పష్టంచేశారు. మలేసియా పర్యటనలో భాగంగా ఆదివారం ఆయన పుత్రజయ నగరం వేదికగా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. సెమీ కండక్టర్లు సహా కీలక రంగాల్లో సహకారానికి సంబంధించి 11 ఒప్పందాలపై వారి సమక్షంలో సంతకాలు జరిగాయి.

ఉగ్రవాదంపై పోరులో భారత వైఖరిని మోదీ మరోసారి తేల్చిచెప్పారు. దీనికోసం భారత్, మలేసియాలు నిఘా వర్గాల సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటున్నాయని వెల్లడించారు. ఇరుదేశాల పరిధిలోని సముద్ర మార్గాల భద్రతకూ ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ''ఇండోపసిఫిక్ ప్రాంతం ఇప్పుడు ప్రపంచ వికాసానికి ఒక ఇంజిన్‌లా మారింది. మేం ఆసియాన్ కూటమి దేశాలు సహా యావత్ ఇండోపసిఫిక్ ప్రాంతంలో శాంతి, సుస్థిరతలను కోరుకుంటున్నాం. ఇంధన, మౌలిక సదుపాయాలు, తయారీ రంగాల్లో ఇరుదేశాల సహకారం బలోపేతమైంది. డిజిటల్ ఎకానమీ, బయోటెక్, ఐటీ విభాగాల్లో ఇరుదేశాల మధ్య పరస్పర పెట్టుబడుల ప్రవాహం పెరిగింది.

తరువాయి 2లో

# కాంగ్రెస్ పాలనలో అన్నీ స్కామ్‌లే

- బీఆర్ఎస్ సర్కార్ తెచ్చిన స్కీములన్నీ బంద్ చేశారు
- పట్టణాల రోడ్లన్నీ గుంతలమయం
- సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్



ఈ-కబురు, సంగారెడ్డి

: పట్టణాల్లో వీధిదీపాలను కూడా వెలిగించలేని మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి.. తన భాషతో వీధి రౌడీలా తయారయ్యారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు.

తరువాయి 2లో

# పదేళ్లు దోపిడీ చేసినందుకు ఓటు వేయాలా?

- బీఆర్ఎస్ హయాంలో ఒక్క ఇల్లు, స్థలం ఇవ్వలేదు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- వైరా, మధిర మున్సిపాలిటీల్లో ఎన్నికల ప్రచారం



ఈ-కబురు, వైరా/మధిర:

'మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు అడుగుతున్నారు.. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని దోచుకున్నందుకు వారికి ఓట్లేయాలా. రూ.8 లక్షల కోట్ల అప్పుల్లో రాష్ట్రాన్ని ముంచినందుకు ఓట్లేయాలా' అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రశ్నించారు. తరువాయి 2లో

# ఇచ్చిన హామీలు రేవంత్ మర్చిపోయారా?

- ఆరు గ్యారంటీల అమలుపై దృష్టి సారించాలి: కిషన్‌రెడ్డి



ఈకబురు,అసెంబ్లీ ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలతో కాలం గడుపుతున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఇప్పటికైనా ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పట్టణ కేంద్రంలోని శంకర్‌పల్లి చౌరస్తాలో ఆదివారం రాత్రి నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. తరువాయి 2లో

# సంఘ్ ఆదేశిస్తే పదవీ విరమణ చేస్తా

## ఆర్ఎస్ఎస్ చీఫ్ భాగవత్




ఈకబురు,ముంబయి: తన పదవీ విరమణపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. వయసుతో సంబంధం లేకుండా పనిని కొనసాగించాలని సంఘ్ తనను కోరిందన్నారు. ఒకవేళ పదవి నుంచి దిగిపోవాలని ఆదేశిస్తే.. వైదొలిగేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ముంబయిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. కులంతో సంబంధం లేకుండా ఎల్లప్పుడూ ఒక హిందువే ఆర్ఎస్ఎస్ చీఫ్‌గా ఉంటారని ఆయన వ్యాఖ్యానించారు. వీర్ సావర్కర్‌కు భారతరత్న పురస్కారం ఇస్తే దాని ప్రతిష్ఠ పెరుగుతుందని భాగవత్ అన్నారు.

**అందుకే సంఘ్‌కు మంచి రోజులు**

భాజపా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్ఎస్ఎస్‌కు 'మంచిరోజులు' వచ్చాయా? అని ప్రశ్నించగా.. దాన్ని మరో కోణంలో అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తరువాయి 2లో

# ఫోరెన్సిక్ ల్యాబ్ ప్రమాదం వెనుక సీఎం

- ఓటుకు నోటు కేసులో సాక్ష్యాలు మాయం
- భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపణ



ఈకబురు, (వరంగల్), : ఓటుకు నోటు కేసులో సాక్ష్యాలు మాయం చేసేందుకే ఫోరెన్సిక్ ల్యాబ్ తగలబెట్టారని, దీని వెనుక సీఎం రేవంత్‌రెడ్డి హస్తం ఉందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. భారాస అభ్యర్థులకు మద్దతుగా ఆదివారం ఆయన వరంగల్, నర్సంపేటలలో రోడ్‌షోలు నిర్వహించారు. అనంతరం కార్నర్ సమావేశాల్లో మాట్లాడారు తరువాయి 3

హనుమకొండ భారాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలోనూ మాట్లాడారు. ''2015లో రూ.50 లక్షలు ఇచ్చి ఎమ్మెల్యేను కొనుగోలు చేసిన కేసులో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి నిందితుడిగా ఉన్నారు. ఆ కేసు విచారణ తుది దశకు వచ్చిన నేపథ్యంలోనే ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్ని ప్రమాదం జరిగింది. మూడంతస్తుల భవనంలో మంటలు ఆర్పేందుకు మూడు గంటలు పట్టిందని చెప్పడం వెనుక కుట్ర కోణం దాగి ఉంది. ఈ ప్రమాదంలో పలు ముఖ్యమైన కేసులకు సంబంధించిన సాక్ష్యాలు కాలిబూడిదైతే.. ఫోరెన్సిక్ అధికారులు నామమాత్రంగా ప్రెస్‌నోట్ విడుదల చేసి చేతులు దులుపుకొన్నారు.

అగ్ని ప్రమాదంలో ఎలాంటి కుట్ర లేకుంటే భారాస శాసనసభ పక్షం.. నిపుణులతో కలిసి వస్తుంది. డీజీపీ అనుమతించాలి. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ ఘటనపై విశ్రాంత న్యాయమూర్తితో సమగ్ర విచారణ చేయించాలి. రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత రాష్ట్రంలో భూమాఫియా రాజ్యమేలుతోంది. స్వయంగా సీఎం సోదరులే భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారు.



# పాతాళం వైపు భూగర్భజలం

- నెలకు దాదాపు మీటరు పడిపోతున్న నీటిమట్టం
- వేసవిలో పొదుపుగా వినియోగించుకోవాలంటున్న నిపుణులు

ఈకబురు, హైదరాబాద్: రాష్ట్రంలో భూగర్భ జల మట్టం నెలనెలకూ పడిపోతోంది. వర్షాలు పూర్తిగా తగ్గిపోవడంతో భూమిలోకి నీరు ఇంకే శాతం తగ్గింది. రాష్ట్ర సగటు భూగర్భ జల మట్టం నెలకు దాదాపు మీటరు వరకు తగ్గుతోంది. 2025 డిసెంబరులో 5.30 మీటర్లు ఉండగా ఈ ఏడాది జనవరిలో 6.27 మీటర్లుగా నమోదైంది. ఈ రెండు నెలల మధ్య మట్టాన్ని పోల్చితే 0.97 మీటర్లు పడిపోగా.. అంతకు ముందు నవంబరు, డిసెంబరు నెలల మధ్య పోల్చితే 0.89 మీటర్లు తగ్గింది తరువాయి 3లో

# జిల్లాలను రద్దు చేయం..
## కొత్తవి ఏర్పాటు చేయం: సీఎం రేవంత్




**ఆ ముగ్గురి అరెస్ట్‌కు కిషన్‌రెడ్డే అడ్డు**

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కల్వకుంట్ల కిషన్‌రావుగా మారి కేసీఆర్‌ను అరెస్టు చేయకుండా అడ్డుపడుతున్నాడని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను అరెస్ట్ చేసే వరకు కిషన్‌రెడ్డిని కల్వకుంట్ల కిషన్‌రావనే పిలుస్తానని స్పష్టం చేశారు. రూ.వేల కోట్ల ఆస్తులను పేదలకు దానం చేసిన సోనియా, రాహుల్‌గాం□దీని సీబీఐ, ఈడీ కేసుల పేరుతో వేధించి అమానించలేదా? గాంధీ కుటుంబంపైన ఈడీ, సీబీఐని ఉపయోగిస్తున్నప్పుడు కాళేశ్వరంపైన సీబీఐ విచారణకు పంపిస్తే ఎవరు అడ్డుకుంటున్నారు'అని ప్రశ్నించారు. ఫెవికాల్ బంధంతో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును కిషన్‌రెడ్డి కంచె వేసి కాపాడుతున్నాడన్నారు. కేసీఆర్‌కు కేటీఆర్ సొంత కొడుకైతే.. కిషన్‌రెడ్డి దత్త పుత్రుడని చెప్పారు.

**ఏప్రిల్ తర్వాత రెండో విడత 'ఇందిరమ్మ'**

ఏప్రిల్ తర్వాత రాష్ట్రంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు అందజేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 'ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తున్నాం. రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నాం. వచ్చే బడ్జెట్‌లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం'అని స్పష్టం చేశారు. 'కేసీఆర్, మోదీని చూసి ఓటు వేయాలని బీఆర్ఎస్, బీజేపీ చెబుతున్నాయి. గల్లీలో మోరీలు కేసీఆర్ వచ్చి తీస్తాడా? కేసీఆర్, మోదీ బొమ్మలు చూపించి ఓట్లు అడగడానికే పనికి వస్తారు.. పెళ్లి పెద్దను చూసి పిల్లను ఇస్తే సంసారం ఆగం అవుతుంది'అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మీ సమస్యలు పరిష్కారం అవుతాయని, ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో బోర్లబొక్కల పడుకున్న కేసీఆర్ నిధులు ఇవ్వడని అన్నారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు రూ.17,442 కోట్లు మంజూరు చేశామని స్పష్టం చేశారు. 2027 గోదావరి పుష్కరాల సందర్భంగా బాసర నుంచి భద్రాచలం వరకు పర్యాటక ప్రాంతాన్ని రూ. 3, 4 వేల కోట్లు ఖర్చు పెట్టి అభివృద్ధి చేస్తామన్నారు.

**సింగరేణిపై అపోహలు వద్దు..**

సింగరేణి వారసత్వ ఉద్యోగాలు, మెడికల్ బోర్డు రద్దు చేస్తారని విష ప్రచారం చేసే వారిని మోకాళ్లపై కూర్చోబెట్టాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు రేవంత్ పిలుపునిచ్చారు. సింగరేణి కార్మికులకు న్యాయం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. 'బీఆర్ఎస్‌ను ఇక నుంచి బ్లాక్‌మెయిల్ రాజకీయ సమితి అని పిలుస్త. ఫోన్ ట్యాపింగ్ ద్వారా బ్లాక్ మెయిల్ చేసి రూ. వందల కోట్లు దోచుకున్నారు. బీఆర్ఎస్ ఖాతాలో రూ. 1,500 కోట్లు ఎవడబ్బ సొమ్ము'అని రేవంత్ ప్రశ్నించారు.

**అక్కలు దసరా రోజు పాలపిట్టల్లా ఉన్నారు..**

'మా అక్కలు దసరా పండుగ రోజు పాలపిట్టల్లా కనిపిస్తున్నారు. బతుకమ్మ చీరలను బాయికాడ పిట్టలను బెదిరించడానికి కట్టారు.. ఇందిరమ్మ చీరను సారె రూపంలో మీ తమ్ముడు పెట్టాడు.. ప్రతి ఏడాది ఇందిరమ్మ చీరను తప్పకుండా ఇస్తాం'అని రేవంత్‌రెడ్డి అన్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రులు ఎంపీ కడియం కావ్య, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు సిరిసిల్ల రాజయ్య, ఐత ప్రకాశ్‌రెడ్డి, జనక్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో అన్నీ స్కామ్‌లే



పట్టణాల్లో రోడ్లన్నీ గుంతలమయంగా మారితే, రేవంత్‌రెడ్డి మాత్రం కండ్లకు గంతలు కట్టుకున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలో పట్టణాల్లో దోమల నివారణకు ఫాగింగ్ జరగడం లేదని.. కేవలం ఫ్రాడింగ్ మాత్రమే చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక స్కీములు బంద్ అయ్యాయని, స్కామ్‌లు మాత్రం జోరందుకున్నాయని ఆరోపించారు.

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, సదాశివపేట, సంగారెడ్డి, గడ్డపోతారం తదితర ప్రాంతాల్లో 15 కార్నర్‌మీటింగ్‌లు, రోడ్‌షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శల వర్షం కురిపించారు. తన తండ్రి వయసు ఉన్న కేసీఆర్‌ను పట్టుకుని కనీస గౌరవం లేకుండా, అతినీచమైన భాషను మాట్లాడుతున్నారని అన్నారు. కేసీఆర్‌ను దూషిస్తే నిరుపేదల కడుపులు నిండవని, సంక్షేమ పథకాలు అమలు చేస్తేనే పేదల కడుపులు నిండుతాయని సూచించారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలని నిలదీస్తున్న కేసీఆర్‌ను జైలులో పెడతామని కాంగ్రెస్ అంటోందని హరీశ్‌రావు మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎన్నికల హామీలను అమలు చేస్తామని రేవంత్‌రెడ్డి రాసిచ్చిన బాండ్ పేపర్ బౌన్స్ అయిందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఈ రెండున్నరేళ్ల పాలనలో కొత్త పథకాలు ఇవ్వకపోగా, బీఆర్ఎస్ అమలు చేసిన పథకాలను బంద్ చేశారని విమర్శించారు.

సంక్షేమ పథకాలను అమలు చేసి, పేదలకు అన్నం పెట్టిన కేసీఆర్‌కు ఓటేస్తారా?, హామీల పేరుతో జనాలకు సున్నం పెట్టిన రేవంత్‌రెడ్డికి ఓటేస్తారో?.. ప్రజలు ఆలోచన చేయాలని హరీశ్‌రావు అన్నారు. అసలు ఎవరో.. నకిలీ ఎవరో ప్రజలకు తెలుసన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భూపాలపల్లిలో చేసిన వ్యాఖ్యలకు హరీశ్ కౌంటర్ ఇచ్చారు. ఎన్నికల హామీలను ఎగ్గొట్టిన రేవంత్‌రెడ్డినే నకిలీ అని అన్నారు.

# బంగ్లా జైలులో మాజీ ఎంపీ రమేశ్ చంద్రసేన్ మృతి



తర్వాత పోలీసులు అరెస్టు చేశారు. హత్య సహా పలు నేరాలను ఆయనపై మోపి జైలుకు తరలించారు. అప్పటి నుంచి ఎలాంటి విచారణ లేకుండా కటకటాలకే పరిమితమయ్యారు. ఇటీవల జైలులో సేన్ ఆరోగ్యం క్షీణించింది. సరైన వైద్యం ఆయనకు అందలేదు. దీంతో జైలులోనే శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. బంగ్లాదేశ్‌లో గురువారం సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సేన్ మృతి కలకలం సృష్టిస్తోంది. అవామీ లీగ్ పార్టీలో రమేశ్ క్రియాశీలంగా ఉండేవారు. షేక్ హసీనా బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు వచ్చేశాక అవామీ లీగ్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తాత్కాలిక ప్రభుత్వం నడుపుతున్న మహమ్మద్ యూనస్ సలహామండలికి లక్ష్యంగా మారారు. ఒక్క 2025 సంవత్సరంలోనే బంగ్లాదేశ్ జైళ్లలో దాదాపు 107 మంది చనిపోయారని, ఇందులో ఎక్కువ మంది అవామీ లీగ్ పార్టీ నేతలేనని ఓ స్వచ్ఛంద సంస్థ పేర్కొంది.

# పాతాళం వైపు భూగర్భజలం



ఇది సాధారణమైనప్పటికీ యాసంగి వినియోగం, వేసవికాలం వల్ల మరింత లోతుకు వెళ్లే అవకాశాలున్నాయి. ఉష్ణోగ్రతలు పెరిగే కొద్దీ నీటి వనరులు అడుగంటడం, బోర్లపై ఆధారపడటం పెరుగుతుంది. రానున్న కాలాన్ని దృష్టిలో పెట్టుకుని నీటిని పొదుపుగా వినియోగించాలని భూగర్భ జలవనరుల శాఖ అధికారులు సూచిస్తున్నారు. అయితే, 2025 జనవరితో పోల్చితే మాత్రం ఈ జనవరి మట్టం 1.19 మీటర్ల పైనే ఉంది. ఈసారి భారీ వర్షాలతో ఈ పరిస్థితి ఉంది.

తాజాగా రాష్ట్ర భూగర్భ జలవనరుల శాఖ విడుదల చేసిన గణాంకాలు

ఈ ఏడాది జనవరిలో ఖమ్మంలో నీటిమట్టం ఉపరితల నుంచి 3.50 మీటర్లలో ఉండగా.. వికారాబాద్ జిల్లాలో అత్యంత లోతులో 9.82 మీటర్ల వద్ద ఉంది. 12 జిల్లాల్లో ఐదు మీటర్ల పైన, 21 జిల్లాల్లో 510 మీటర్ల మధ్య ఉంది. డిసెంబరుతో జనవరి నీటి మట్టాలను పోల్చితే నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 2.36 మీటర్లకు పడిపోయింది. కామారెడ్డి జిల్లాలో 1.72, మెదక్ 1.57, సిద్దిపేట 1.58, వికారాబాద్ 1.48, సంగారెడ్డి 1.43, మహబూబ్‌నగర్ 1.30 మీటర్ల లోతుకు మట్టం పడిపోయింది. అన్ని జిల్లాల్లోనూ తగ్గుదల కనిపించింది.

2025 జనవరితో పోల్చితే ఈ ఏడాది జనవరిలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2.20 మీటర్లు, జయశంకర్ భూపాలపల్లి 0.59, ఖమ్మం జిల్లాలో 0.09 మీటర్లు పడిపోయింది. మిగిలిన 30 జిల్లాలో 0.01 నుంచి 4.51 మీటర్ల వరకు పెరుగుదల నమోదైంది.

రాష్ట్ర సాధారణ వర్షపాతం 851 మిల్లీమీటర్లు కాగా గతేడాది జూన్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు 1,178 మి.మీ.(37% ఎక్కువ) నమోదైంది.

# పదేళ్లు దోపిడీ చేసినందుకు ఓటు వేయాలా?



ఖమ్మం జిల్లా వైరా, మధిర మున్సిపాలిటీల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో భట్టి మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలన కాలంలో పేదలకు ఒక్క ఇల్లు కానీ, ఇంటి స్థలం కానీ ఇవ్వలేదని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా.. మళ్లీ ఇప్పుడు తాము వచ్చాకే మొదటి దశలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి రూ.22,500 కోట్ల నిధులు వె చ్చిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో పేదలు రేషన్ కార్డుల కోసం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగితే పట్టించుకోలేదన్నారు. అప్పుడు ఇచ్చిన దొడ్డు బియ్యం పేదలకు ఉపయోగపడలేదని చెప్పారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలోని 1.05 కోట్ల కుటుంబాలకు గాను 1.02 కోట్ల కుటుంబాలకు సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు. అంతేకాక ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వడంతో పాటు మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా రూ.27 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, రాష్ట్ర హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యం, డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాల్లేవు




మలేసియా- భారత్ ప్రజల మధ్య సంబంధాలు సైతం మరింత మెరుగయ్యాయి. ఫలితంగా ఇరుదేశాల్లో పర్యాటక రంగానికి ఊతం లభించింది. ఈ విజయాల స్ఫూర్తితో మలేసియా, భారత్ భాగస్వామ్యాన్ని మునుపెన్నడూ లేనంత వేగంతో బలోపేతం చేయాలని ఇరువురం నిర్ణయించాం. ఇకపై రక్షణ రంగం, సెమీకండక్టర్ల తయారీ విభాగాల్లోనూ సహకారాన్ని పెంచుకోనున్నాం" అని చెప్పారు. మలేసియాలోని నలుగురు ప్రముఖ వ్యాపారవేత్తలతో మోదీ సమావేశమై.. భారత వృద్ధి గాథలో పాలుపంచుకోవాలన్న వారి ఆసక్తిని అభినందించారు. మలేసియాలోని భారత సంతతి మంత్రులు, ఎంపీలు, సెనేటర్లతోనూ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తమిళుల గురించి మరోసారి ప్రశంసలు కురిపించారు. ఆజాద్ హింద్ ఫౌజ్‌లో పనిచేసిన జెయరాజ్ రాజారావుతో భేటీ అయ్యారు.

**పెర్దన పుత్రలో ఘన స్వాగతం**

మోదీ ఆదివారం ఉదయం కౌలాలంపూర్ నుంచి పుత్రజయ నగరానికి చేరుకున్నారు. మలేసియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం అధికారిక నివాసం పెర్దన పుత్రలో అధికారిక లాంఛనాలతో ఆయనకు స్వాగతం లభించింది. అనంతరం ఇరుదేశాల ఉన్నతాధికారుల బృందాలు, ప్రధానుల మధ్య ద్వైపాక్షిక సమావేశాలు జరిగాయి. దేశీయ కరెన్సీల్లో చెల్లింపుల్ని ప్రోత్సహించే ప్రయత్నాలను ఇరుదేశాలూ కొనియాడాయి. భారత్‌తో వాణిజ్యానికి మరిన్ని అవకాశాలు లభిస్తే తమకెంతో ప్రయోజనమని ఇబ్రహీం అన్నారు. మలేసియా పర్యటన ముగించుకుని మోదీ భారత్‌కు బయల్దేరారు.

# కమ్యూనిస్టుల భావజాలమే విధ్వంసకరం



ముందుగా అనుకున్న మేరకు మార్చి 31 నాటికి ఈ ముప్పు పూర్తిగా తొలగిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కమ్యూనిస్టుల భావజాలం దేశానికి విధ్వంసకరమని షా వ్యాఖ్యానించారు. ఈ భావజాలాన్ని భారత్ త్వరగా వదిలించుకోవాలని అన్నారు. ఛత్తీస్‌గఢ్ రాజధాని నయా రాయ్‌పుర్‌లో ఆదివారం వామపక్ష తీవ్రవాదంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.

# ఇచ్చిన హామీలు రేవంత్ మర్చిపోయారా?



ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల వేళ రైతులు, మహిళలు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను రేవంత్‌రెడ్డి మర్చిపోయారా అని ప్రశ్నించారు. భారాసకు పదేళ్లు అధికారం ఇస్తే ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని.. ఆ పార్టీ నేతలు తెలంగాణ సంపదను దోచుకున్నారని విమర్శించారు. ఈ దఫా మున్సిపల్ ఎన్నికల్లో భాజపా అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్రంలోని గ్రామాలతోపాటు పట్టణాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రత్నం, భాజపా జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు అనంతరెడ్డి, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఆ పార్టీ అభ్యర్థులు పాల్గొన్నారు.

# సంఘ్ ఆదేశిస్తే పదవీ విరమణ చేస్తా




అయోధ్యలో రామమందిరం నిర్మించేందుకు ఆర్ఎస్ఎస్ కట్టుబడి ఉందని, దానికి మద్దతు తెలిపిన వారికి ప్రయోజనం చేకూరిందని వివరణ ఇచ్చారు. సిద్ధాంతపరమైన విధానాలకు కట్టుబడి ఉండటంతోపాటు.. వాలంటీర్ల కృషి వల్ల సంఘ్‌కు మంచి రోజులు వచ్చాయని మోహన్ భాగవత్ అన్నారు. 'ఉమ్మడి పౌరస్మృతి' గురించి ప్రస్తావన రాగా, అన్ని వర్గాలను పరిగణనలోకి తీసుకొని దాన్ని రూపొందించాలని, అది విభేదాలకు దారితీయకూడదని భాగవత్ సూచించారు. జనాభాలో మతపరమైన అసమతుల్యత గురించి మాట్లాడుతూ, మత మార్పిళ్లు, విదేశీయుల చొరబాట్లు, జననాల రేటు తగ్గిపోవడం అందుకు ప్రధాన కారణాలని భాగవత్ చెప్పారు. ప్రతి కుటుంబంలోనూ ముగ్గురు పిల్లలుండాలని శాస్త్రీయ అధ్యయనాలు చెబుతున్నాయని, అయితే దాన్ని పాటించాలా లేదా అన్నది వ్యక్తిగత ఎంపిక మాత్రమేనని ఆయన వ్యాఖ్యానించారు.

# గచ్చిబౌలి డివిజన్ ప్రజల రుణం తీర్చుకోలేనిది

## కృతజ్ఞత సమావేశంలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



రవికుమార్ యాదవ్ తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న గంగాధర్ రెడ్డిసాయిబాబా



కార్పొరేటర్ గంగాధర్ రెడ్డిని అభినందిస్తున్న కాలనీలు, కమ్యూనిటీల ప్రతినిధులు

**ఈ-కబురు, శేరిలింగంపల్లి : తనపై ఎంతో నమ్మకం ఉంచి ఐదేళ్లు కార్పొరేటర్ గా పనిచేసే అవకాశం కల్పించిన గచ్చిబౌలి డివిజన్ ప్రజల రుణం తీర్చుకోలేనిదని, డివిజన్ ప్రజల సహకారంతోనే గత ఇదేళ్లుగా ముందుకు సాగానని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి. గంగాధర్ రెడ్డి అన్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల బెల్లా విస్టా క్లబ్ హౌస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ కృతజ్ఞత సమావేశంలో కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జి ఎం.రవికుమార్ యాదవ్ తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ గంగాధర్ రెడ్డిని స్థానికులు అభినందించారు.**



కార్పొరేటర్ కుమారుడితో మాతృమూర్తి సంతోషం



కార్పొరేటర్ గంగాధర్ రెడ్డిని అభినందిస్తున్న కాలనీలు, కమ్యూనిటీల ప్రతినిధులు

ఐదేళ్ల పదవీ కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న గంగాధర్ రెడ్డిని అభినందించిన రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధిలో కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి తనదైన ముద్ర వేశారని ప్రశంసించారు.ప్రజల అవసరాలను గుర్తించి, మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపించిన నాయకుడు గంగాధర్ రెడ్డి అని అన్నారు. అనంతరం కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్ల క్రితం కార్పొరేటర్ గా పోటీ చేసినప్పుడు తనపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రజలకోసం నిరంతరం పని చేశానని, ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పించడం కోసం అధికారులు, స్థానిక ఎమ్మెల్యే మేయర్, ఎంపీ, సహకారం తో డివిజన్‌లో అవసరమైన నిధులు రప్పించి, శక్తివంచన లేకుండా అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. తన ఐదేళ్ల కార్పొరేటర్ పదవీకాలంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదురైనా, వాటిని అధిగమిస్తూ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగానని తెలిపారు. ఆలయాల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేశానని, దానికి దేవుడి ఆశీస్సులు, ప్రజల మద్దతు తనకు ఎల్లప్పుడూ లభించాయని అన్నారు. ఇన్నాళ్లు తన వెంట నడిచిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులకు పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా గచ్చిబౌలి డివిజన్‌ను అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజల ఆశీస్సులు, సహకారం ఇలాగే ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని పలు గేటెడ్ కమ్యూనిటీల అసోసియేషన్ల ప్రతినిధులు, కాలనీలు, బస్తీలు, గ్రామాల కమిటీల ప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# ఫోరెన్సిక్ ల్యాబ్ ప్రమాదం వెనుక సీఎం



రేవంత్‌రెడ్డి అనుచరుడు రోహిణ్‌రెడ్డి దక్కన్ సిమెంట్ యాజమాన్యానికి తుపాకీ పెట్టి డబ్బులు వసూలు చేశారని స్వయంగా మంత్రి కొండా సురేఖ కుమార్తె ఆరోపిస్తే ఆ ఘటనపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? హైదరాబాద్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుమారుడు భూకబ్జా చేస్తే ఆ ఘటనపై కేసు నమోదు చేసిన స్థానిక పోలీసు అధికారిని ఎందుకు బదిలీ చేశారు? ఏడాదిన్నర క్రితం పొంగులేటి ఇంటిపై ఈడీ దాడులు చేసింది. ఆ ఘటనపై ఇప్పటివరకు కేసు ఎందుకు నమోదు చేయలేదు' అని కేటీఆర్ ప్రశ్నించారు.

**దొంగ హామీలతో కాంగ్రెస్ మోసం**

శాసనసభ ఎన్నికల్లో మార్పు పేరుతో దొంగ హామీలిచ్చి కాంగ్రెస్ ప్రజల్ని మోసం చేసిందని కేటీఆర్ విమర్శించారు. డిసెంబరులో ఇవ్వాల్సిన రైతుబంధును ఫిబ్రవరి వచ్చినా రేవంత్‌రెడ్డి ఇవ్వలేదని దుయ్యబట్టారు. ఆరుగ్యారంటీల పేరుతో వంచించిన కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. రోడ్ షోలో నర్సంపేట, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్, 30 వార్డులకు పోటీ చేస్తున్న భారాస అభ్యర్థులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# 114 రఫేల్ జెట్ల ఒప్పందం ఖరారు!



ఈకబురు, న్యూఢిల్లీ: అత్యంత అధునాతన, శక్తిమంతమైన రఫేల్ యుద్ధ విమానాలతో భారత గగనతలాలను శత్రు దుర్భేద్యంగా మార్చే ప్రక్రియను రక్షణ శాఖ వేగవంతం చేసింది. రూ.3.25 లక్షల కోట్ల వ్యయంతో ఒకేసారి 114 రఫేల్ ఫైటర్‌జెట్‌లను కొనుగోలుచేసేందుకు ఉద్దేశించిన సమీకరణ ఒప్పంద ప్రతిపాదనలకు సాయుధ ఉపకరణాల సమీకరణ బోర్డ్ ఇటీవల పచ్చజెండా ఊపగా, రక్షణ కొనుగోళ్ల మండలి వాటికి ఆమోద ముద్ర వేయనుందని సమాచారం. ఈ నెల చివరికల్లా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ భారత్‌లో పర్యటించనున్న నేపథ్యంలో ఆ దేశానికి చెందిన రక్షణ రంగ ప్రైవేట్ దిగ్గజం డసాల్ట్ ఏవియేషన్ నుంచి ఈ ఫైటర్ జెట్‌లను కొనుగోలు చేయనుండటం గమనార్హం. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సారథ్యంలోని రక్షణ కొనుగోళ్ల మండలి త్వరలో రోజుల్లో సమావేశమై లక్షల కోట్ల రూపాయల విలువైన ఈ 'కనీస అనుమతి'ప్రతిపాదనకు అంగీకారం తెలపనుంది. ఒప్పందం సాకారమైతే కేవలం 18 విమానాలు మాత్రమే ఫ్రాన్స్‌లో తయారై నేరుగా భారత్‌కు ఎగిరొస్తాయి.

మిగతా వాటిని భారత్‌లోనే ఉత్పత్తి కర్మాగారాలను నెలకొల్పి దేశీయంగా తయారు చేయనున్నారు. ఈ లెక్కన దాదాపు 80 శాతం విమానాలు భారత్‌లోనే తయారుకానున్నాయి. అంతేకాదు, వాటిల్లో 60 శాతం విడిభాగాలను మేకిన్ ఇండియా ఆత్మనిర్భరత కార్యక్రమంలో భాగంగా ఇక్కడే అభివృద్ధి చేయనున్నారు. రఫేల్ యుద్ధవిమానాలను దేశీయంగా తయారు చేయాలని భారత్ నిర్ణయించుకున్న నేపథ్యంలో స్థానిక ప్రైవేట్ కంపెనీలతో దసాల్ట్ ఏవియేషన్ ఒప్పందాలు చేసుకోవాల్సి రావొచ్చు. అసెంబ్లింగ్, తయారీ యూనిట్లను నెలకొల్పాల్సి ఉంటుంది.

# సేవా భారతి ఆధ్వర్యంలో నేతాజీ నగర్ లో ఉచిత వైద్య శిబిరం

**ఈ-కబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని నేతాజీ నగర్ లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి భారీగా హాజరైన స్థానికులు పలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆర్ఎస్ఎస్ కు అనుబంధంగా పనిచేస్తున్న సేవా భారతి ఆధ్వర్యంలో నేతాజీ నగర్ లోని ఎల్లమ్మ గుడి ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి హాజరైన స్థానికులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు అవసరమైన వారికి మందులను అందజేశారు. వైద్య శిబిరంలో పాల్గొన్న వెస్టిన్ ఆసుపత్రి డాక్టర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రోజు కొంత సమయాన్ని వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటే వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చని తెలిపారు. నేతాజీ నగర్ నుండి దాదాపు 200 మంది ఈ శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు.**



వైద్య శిబిరంలో స్థానికులకు పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

# మెగా చినాబ్ డ్యామ్ ప్రాజెక్ట్ వేగవంతం



.రామ్‌బాన్ జిల్లాలో రూ.5,129 కోట్లతో నిర్మించతలపెట్టిన సావల్‌కోట్ జలవిద్యుత్ ప్రాజెక్ట్ కోసం తాజాగా టెండర్లు పిలిచింది.

ప్రభుత్వ రంగ నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ ఈ టెండర్లను ఆహ్వానించింది. పాకిస్తాన్‌కు నీటి అవసరాలు తీర్చే చినాబ్ నదిపై ఈ జలవిద్యుత్ కేంద్రాన్ని నిర్మించనున్నారు. 1,856 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మించబోయే ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ఈ ప్రాంతంలోనే అతిభారీ హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్ట్‌గా ఇది నిలిచిపోనుంది.

సిందూ నదీజలాల ఒప్పందాన్ని స్తంభింపజేసిన నేపథ్యంలో పాకిస్తాన్‌కు బుద్ధిచెప్పడంతోపాటు సరిహద్దు ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి కొత్త ప్రాజెక్ట్ బాటలుపరుస్తుందని ఎన్‌డీఏ సర్కార్ తాజాగా పునరుద్ఘాటించింది. కొత్త ప్రాజెక్ట్‌కు సంబంధించి డ్యామ్, సొరంగాలు, అనుబంధ పనులకు సంబంధించిన టెండర్లు వచ్చే నెల 12వ తేదీతో మొదలై 20వ తేదీతో ముగుస్తాయి. టెండర్లలోని నిబంధనలు బిడ్ అనేది గరిష్టంగా 180 రోజులపాటు మనుగడలో ఉంటుంది. గరిష్టంగా 3,285 రోజుల్లోపు ప్రాజెక్ట్‌ను పూర్తిచేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఏకబిగిన దాదాపు పదిసంవత్సరాలపాటు డ్యామ్ నిర్మాణపనులు జరగనున్నాయి.

దశాబ్దాల కల...: ఈ ప్రాంతంలో సావల్‌కోట్ హైడ్రోఎలక్ట్రిక్ డ్యామ్ కట్టాలని భారత్ దశాబ్దాల క్రితమే భావించింది. అయితే గతంలో పాక్‌తో సింధూ నదీజలాల ఒప్పందం అమల్లో ఉండటం, సరిహద్దు వద్ద ఉద్రిక్తతలు కాస్తంత తగ్గుముఖం పట్టడంతో ఈ ప్రాజెక్ట్ కాగితాలకే పరిమితమైంది. అయితే గత ఏడాది పహల్గామ్ పచ్చికమైదానాల్లో 26 మంది అమాయక పర్యాటకులను ముష్కరులు పాయింట్ బ్లాంక్‌లో కాల్చి హేయమైన చర్యలకు దిగడంతో భారత్ ఉగ్రరూపం దాల్చింది.

ఆపరేషన్ సిందూర్ పేరిట ముష్కరుల శిక్షణ శిబిరాలతోపాటు పాక్ వైమానిక స్థావరాలపై ముప్పేట దాడులు చేసింది. ఆ తర్వాత సింధూ నదీజలాల ఒప్పందం నుంచి గత ఏడాది ఏప్రిల్ నెలలో తప్పుకుంది. పాకిస్తాన్‌కు నీటికష్టాలు పెంచాలనే ఉద్దేశంతో వెంటనే పాత సావల్‌కోట్ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించింది. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే జమ్మూకశ్మీర్ విద్యుత్ కష్టాలు తీరడంతోపాటు జాతీయ పవర్‌గ్రిడ్ సామర్థ్యం సైతం పెరుగుతుంది. స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరగడంతోపాటు ఈ ప్రాంతంలో మౌలికసదుపాయాలు మెరుగవనున్నాయి.

# జీవితం పూలపాన్పు కాదు

## అన్నింటినీ సమర్థంగా ఎదుర్కోవాలి
## జెన్‌జెడ్ విద్యార్థులకు రాహుల్ సూచన



న్యూఢిల్లీ: జీవితం అనేది ఎత్తుపల్లాల్లేకుండా సరళరేఖలా ఉండదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని యువ ఎన్ఐఆర్ విద్యార్థులతో వీడియో ద్వారా రాహుల్ సంభాషించారు. ఆ సంభాషణ తాలూకు వివరాలను రాహుల్ తన యూట్యూబ్ ఖాతాలో ఆదివారం పోస్ట్‌చేశారు.

" వాస్తవిక ప్రశ్నలు, నిజాయతీ అయిన సమాధానాలు. ఇందులో ఎలాంటి వడబోతలు లేవు. నేటి యువత గుర్తింపు సమస్యతోపాటు ఒత్తిడిని బాగా ఎదుర్కొంటోంది. జెన్ జెడ్ యువత తమ ఇష్టాయిష్టాలను, వృత్తిజీవితాన్ని ఎలా సమతుల్యం చేసుకోవాలో తెలీక సతమతమవుతోంది.

స్వేచ్ఛగా ఆలోచించడానికి తమ భావాలను వ్యక్తపర్చడానికి యువత ఇబ్బందిపడుతోంది. కొత్త విషయాలను తెల్సుకోవడం మొదలలు ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలి, ఒక నిర్ణయం నుంచి ఎలా బయటపడాలి అనే సమస్యలూ జెన్‌జెడ్‌ను చుట్టుముట్టాయి. తమకు తమకు నమ్మకం లేక ఎలా ఇబ్బందులపాలవుతున్నారో, అభద్రతా భావంతో కుంగిపోతున్నారో వాళ్లు నాతో చెప్పారు. ఇబ్బందులు పడే జెన్‌జెడ్‌కు నేనిచ్చే సందేశం ఒక్కటే. సమయానుకూలంగా వ్యవహరిస్తూ దృఢచిత్తంతో పోరాడాలి. అన్నింటినీ ఎదుర్కోవాలి" అని సూచించారు


# జియో రూ.198 రీఛార్జ్ ప్లాన్ ...రోజుకు 2 జీబీ డేటా




భారతదేశపు అతిపెద్ద టెలికాం ఆపరేటర్ అయిన రిలయన్స్ జియో తన కస్టమర్ల కోసం ఎప్పటికప్పుడు సరికొత్త 5జీరీఛార్జ్ ప్లాన్‌లను పరిచయంచేస్తుంది. ఇందులో సరసమైన రీఛార్జ్ ప్లాన్స్ కూడా అందుబాటులో ఉన్నాయి. **రూ.198 రీఛార్జ్ ప్లాన్....**ఇది రిలయన్స్ జియో తన కస్టమర్ల కోసం అందిస్తున్న సరసమైన రీఛార్జ్ ప్లాన్. ఈ ప్లాన్ రీఛార్జ్ చేసుకుంటే.. రోజుకు 2జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు, అపరిమిత వాయిస్ కాలింగ్ వంటివి పొందవచ్చు. అయితే దీని వ్యాలిడిటీ కేవలం 14 రోజులు మాత్రమే. **రూ.349 రీఛార్జ్ ప్లాన్....**ఈ ప్లాన్ ద్వారా రోజుకు 2 జీబీ హైస్పీడ్ డేటా పొందవచ్చు. రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు లభిస్తాయి. వ్యాలిడిటీ 28 రోజులు. జియో హాట్‌స్టార్, జియోసావన్ ప్రో సబ్‌స్క్రిప్షన్‌లతో పాటు.. మూడు నెలలు జొమాటో గోల్డ్ కూడా పొందవచ్చు. జియో టీవీ, జియో సినిమా, జియో క్లౌడ్ వంటి వాటికి యాక్సెస్ కూడా పొందవచ్చు

# ఏఐ రేసులో భారత్.. మూడేళ్లలో రూ.6 లక్షల కోట్లు!

కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో ప్రపంచ దేశాల మధ్య పోటీ వేగంగా పెరుగుతున్న వేళ.. పెట్టుబడుల పరంగా భారత్ కూడా ఈ రేసులో ముందంజలోనే ఉందని వరల్డ్ ఎకనమిక్ ఫోరం వెల్లడించింది. 2010 నుంచి 2024 వరకు ఏఐలో అత్యధిక పెట్టుబడులు (జీడీపీలో శాతంగా లెక్కించినప్పుడు) పెట్టిన 11 దేశాల జాబితాలో భారత్‌కు 8వ స్థానం దక్కింది. మరోపక్క.. ఏఐ మనదేశ ఆర్థిక వ్యవస్థకు భారీ ఊతమివ్వనుందని పీడబ్ల్యూసీ ఇండియా తెలిపింది. 2035 నాటికి ఏఐ వల్ల దేశ జీడీపీలోకి సుమారు రూ.50 లక్షల కోట్లు అదనంగా చేరే అవకాశం ఉందని అంచనా వేసింది. ఇటీవల దావోస్‌లో.. ప్రముఖ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ సంస్థ బెయిన్ అండ్ కంపెనీతో కలిసి వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఓ శ్వేత పత్రం విడుదల చేసింది. దాని ప్రకారం.. 2010 నుంచి 2024 వరకు ఏఐలో పెట్టుబడుల పరంగా అమెరికా, సింగపూఅమెరికా, చైనా దూకుడు 2010-2024 మధ్య కాలంలో ఏఐ రంగంలో పెట్టుబడులు ఏడాదికి సగటున 33 శాతం చొప్పున పెరిగాయని శ్వేతపత్రం తెలిపింది. ఏఐ రంగం అత్యంత ఖరీదైనదనీ, భారీగా పెట్టుబడులు అవసరమైనప్పటికీ తక్షణ లాభాలపై స్పష్టత లేదని పేర్కొనడం విశేషం. కానీ, అమెరికా, చైనా ఈ రంగంలో భారీ పందాలు కాస్తున్నాయి. 2010 నుంచి ఇప్పటి వరకు పెట్టిన మొత్తం ఏఐ పెట్టుబడుల్లో 65 శాతం ఈ రెండు దేశాలదే కావడమే అందుకు నిదర్శనం. **మూడేళ్లలో రూ. 6 లక్షల కోట్లు.....** భారత్‌లో వచ్చే మూడేళ్లలో రూ.6.14 లక్షల కోట్లకుపైగా ఏఐ పెట్టుబడులు వాస్తవ రూపం దాల్చనున్నాయని వరల్డ్ ఎకనమిక్ ఫోరం అంచనా వేసింది. అలాగే ఏఐకి అవసరమైన అధునాతన చిప్‌లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో, హార్డ్‌వేర్ రంగంలో పెట్టుబడులు ఏటా 15 నుంచి 25 శాతం వరకు పెరిగే అవకాశముందని తెలిపింది. **ఆర్థిక వ్యవస్థకూ ఊతం.....**భారత్ ఆర్థిక వ్యవస్థకు ఏఐ భారీ ఊతమివ్వనుందని పీడబ్ల్యూసీ ఇండియా అంచనా వేసింది. 2035 నాటికి ఏఐ వల్ల దేశ జీడీపీలోకి రూ.50 లక్షల కోట్లకుపైగా అదనంగా వచ్చి చేరే అవకాశం ఉందని వెల్లడించింది. వ్యవసాయం, విద్య, ఇంధనం, ఆరోగ్యం, తయారీ రంగాల్లో ఏఐ వినియోగం వేగంగా పెరిగితే ఈ వృద్ధి సాధ్యమవుతుందని పేర్కొంది. 2050 నాటికి 160 కోట్ల జనాభాకు ఆహారం అందించాలంటే వ్యవసాయ ఉత్పత్తిని 70 శాతం వరకు పెంచాల్సి ఉంటుందని,




దీనికి డిజిటల్ సాంకేతికతలు, ముఖ్యంగా ఏఐ అవసరమని పేర్కొంది. అలాగే విద్య, వైద్య రంగాల్లోనూ ఏఐ కీలకపాత్ర పోషించనుందని వివరించింది.ర్, దక్షిణ కొరియా, చైనా తొలి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. ఇదే సమయంలో.. భారత్‌లో ఏఐ పెట్టుబడులు జీడీపీలో 1.2 నుంచి 1.8 శాతం వరకు ఉన్నాయి. అమెరికాలో ఇది రికార్డు స్థాయిలో 3.4 నుంచి 5.1 శాతం, సింగపూర్‌లో 3.1 నుంచి 4.6 శాతం వరకు ఉంది.

# మొన్న హ్యుందాయ్.. నేడు టాటా .. పెరగనున్న కార్ల ధరలు



మారుతి సుజుకి, టయోటా కంపెనీలు తమ కార్ల ధరలు పెంచిన తరువాత.. దేశీయ దిగ్గజం టాటా మోటార్స్ కూడా తన కార్ల రేట్లను పెంచనున్నట్లు ప్రకటించింది. పెరుగుతున్న వస్తువుల ధరలు, ఖర్చులు కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ వెల్లడించింది.

అయితే కొత్త ధరలు ఎప్పటి నుంచి అమలులోకి వస్తాయనే విషయాన్ని కంపెనీ వెల్లడించలేదు. కంపెనీ దాదాపు ఒక సంవత్సరం నుంచి అధిక ఇన్‌పుట్ ఖర్చులను ఎదుర్కొంటోంది. ఈ ప్రభావం ఇప్పుడు ధర సవరణకు కారణమైందని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ లిమిటెడ్ (TMPVL) యోచిస్తోందని దాని మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సీఈఓ శైలేష్ చంద్ర పేర్కొన్నారు. టాటా మోటార్స్ ఏ కారు ధరలను ఎంత శాతం పెంచనుంది అనే విషయాలను అధికారికంగా వెల్లడించలేదు. కొత్త ధరలను బహుశా త్వరలోనే వెల్లడించే అవకాశం ఉందని సమాచారం. ధరల పెరుగుదల అమ్మకాలపై ప్రభావం చూపుతుందా.. లేదా అనేది తెలియాల్సి ఉంది. కాగా హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇప్పటికే తమ కార్ల ధరలను జనవరిలో పెంచింది.

# అమెరికాకు భారత్ తలొగ్గలేదు

## కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్

భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందంపై వస్తున్న విమర్శలను కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తీవ్రంగా ఖండించారు. 18 శాతం సుంకానికి అంగీకరించడం ద్వారా భారత్ అమెరికాకు తలొగ్గిందన్న వాదనల్లో నిజం లేదని స్పష్టం చేశారు. చైనా ఎగుమతులు 35 శాతం సుంకాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో భారత ఎగుమతులకు లభించే 18 శాతం సుంకం దేశానికి పెద్ద ఊరటనిస్తుందని విశ్లేషించారు. ఇటీవల కుదిరిన ఈ ఒప్పందం అనంతరం ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో గోయల్ కొన్ని అంశాలను వెల్లడించారు. **బలమైన ఆర్థిక శక్తిగా భారత్.....**ప్రస్తుతం భారత్ నాలుగు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎంతో ఆత్మవిశ్వాసంతో చర్చల్లో పాల్గొంటోందని గోయల్ అన్నారు.

'2047 నాటికి భారత్ 3035 ట్రిలియన్ డాలర్ల అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుంది. భవిష్యత్తులో మనం అందించే భారీ మార్కెట్ అంతర్జాతీయ వాణిజ్య చర్చల్లో దేశానికి అతిపెద్ద బలం' అని ఆయన అభివర్ణించారు. **అమెరికా నుంచి కొనుగోళ్లు....** వచ్చే ఐదేళ్లలో అమెరికా నుంచి 500 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను కొనుగోలు చేయడంపై భారత్ సంసిద్ధత వ్యక్తం చేసింది. దీనిపై మంత్రి స్పందిస్తూ.. 'భారతదేశం పెరుగుతున్న అవసరాల దృష్ట్యా ఈ లక్ష్యం చాలా తక్కువ. మొత్తం రెండు ట్రిలియన్ డాలర్ల దిగుమతి డిమాండ్‌లో అమెరికా వాటా కొంత భాగమే. ప్రస్తుతం ఇతర దేశాల నుంచి కొంటున్న 300 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను, పోటీతత్వాన్ని బట్టి అమెరికా సరఫరాదారుల నుంచి తీసుకునే అవకాశం ఉంది. విమానయాన రంగం, ఇంధనం, సాంకేతిక ఉత్పత్తులు, కోకింగ్ కోల్ వంటి వాటికి భారత్ ప్రాధాన్యత ఇస్తుంది' అన్నారు. **వ్యూహాత్మక చర్చలు....**వాణిజ్య చర్చలంటే కేవలం అంకెలు కాదని, అవి దేశ ప్రజల భవిష్యత్తును ప్రభావితం చేస్తాయని గోయల్ పేర్కొన్నారు. 'మేము వివిధ దేశాలతో ఇప్పటివరకు కుదుర్చుకున్న తొమ్మిది ఒప్పందాల్లో ఎక్కడా జాతీయ ప్రయోజనాల విషయంలో రాజీ పడలేదు. చర్చల్లో ప్రశాంతత ఎంత ముఖ్యమో, అవసరమైనప్పుడు వ్యూహాత్మకంగా వ్యవహరించడం కూడా అంతే ముఖ్యం' అని ఆయన వెల్లడించారు. భారత్‌ఈయూ ఒప్పందంపై మాట్లాడుతూ, ప్రధాని మోదీకి ప్రపంచ దేశాధినేతలతో ఉన్న సాన్నిహిత్యం వల్ల కూటమిలోని 27 దేశాల నుంచి సానుకూల స్పందన లభిస్తోందని ఆయన తెలిపారు. ప్రధాని మార్గదర్శకత్వంలో హోం మంత్రి అమిత్ షా, కేబినెట్ సహకారంతో గ్లోబల్ ట్రేడ్ మార్కెట్‌లో భారత్ కీలకంగా మారుతుందని గోయల్ అన్నారు.



# పోస్టాఫీస్ స్కీమ్.. నెలకు రూ. 5వేలుతో.. రూ. 8లక్షలు చేతికి!




ఎంత డబ్బు సంపాదించే వారికైనా పొదుపు చేయడం తప్పనిసరి. ఆర్థిక క్రమశిక్షణ లేకుండా.. దుబారా ఖర్చు చేస్తే మాత్రం చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రస్తుతం పెట్టుబడికి అనేక మార్గాలు ఉన్నాయి. ఇందులో కొంత రిస్క్ కూడా ఉంటుంది.

అయితే రిస్క్ లేకుండా.. ప్రభుత్వ హామీతో సురక్షితమైన లాభం ఆశించేవారికి పోస్టాఫీస్ రికరింగ్ డిపాజిట్ ఓ మంచి ఎంపిక అవుతుంది. నెలకు రూ.5000 చొప్పున పోస్టాఫీస్ రికరింగ్ ఖాతాలో జమ చేస్తూ.. ఐదేళ్లు ఇన్వెస్ట్ చేయలి. ఇలా చేసుకుంటూ పోతే.. మీ పెట్టుబడి రూ.3 లక్షలు అవుతుంది. ప్రభుత్వం దీనికి 6.7 శాతం వార్షిక వడ్డీ ఇస్తుంది. ఐదేళ్ల కాలం మీరు చేసిన డబ్బుకు మొత్తం రూ. 3,56,830 లభిస్తుంది. దీనిని మీరు పదేళ్లు పొడిగించుకుంటే.. మొత్తం పెట్టుబడి రూ. 6,00,000 (5000 x 120 నెలలు). దీనికి 6.7 శాతం వడ్డీ అనుకుంటే రూ. 2,54,272 వస్తుంది. వడ్డీ, అసలు కలిపితే మొత్తం రూ. 8,54,272 అవుతుంది. నిజానికి ఒక సాధారణ వ్యక్తికి లేదా ఒకేసారి పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టలేని వారికి ఈ పోస్టాఫీస్ రికరింగ్ స్కీమ్ బెస్ట్ అనే చెప్పాలి. పిల్లల చదువుకు, పెళ్లి వంటి అవసరాలకు ఇది కొంత ఉపయోగకరంగా ఉంటుంది.

# ప్రభుత్వ సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేయాలా?

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సామాన్య పెట్టుబడిదారులను దృష్టిలో ఉంచుకుని ప్రవేశ పెట్టిన 'ఆర్‌బీఐ రిటైల్ డైరెక్ట్' మొబైల్ యాప్ భారతీయ ఆర్థిక రంగంలో విప్లవాత్మక మార్పుగా చెప్పవచ్చు. గతంలో కేవలం బ్యాంకులు, పెద్ద సంస్థలకే పరిమితమైన ప్రభుత్వ సెక్యూరిటీల మార్కెట్‌ను సామాన్యులకు కూడా అందుబాటులోకి తీసుకురావడం ఈ యాప్ ప్రధాన ఉద్దేశం. దీన్ని ప్రారంభించి చాలా రోజులైనా దీని గురించి చాలా మందికి సరైన అవగాహన లేదు. దీర్ఘకాలంలో కచ్చితమైన రాబడులను ఇస్తూ ప్రభుత్వ ఆధ్వర్యంలోని బాండ్లను కొనుగోలు చేసేందుకు ఇది అవకాశం కల్పిస్తుంది. ఈ యాప్ ద్వారా పెట్టుబడిదారులు కేంద్ర ప్రభుత్వ సెక్యూరిటీలు, రాష్ట్ర ప్రభుత్వ బాండ్లు (ఎస్‌డీఎల్), ట్రెజరీ బిల్లులు (TBills), సావరిన్ గోల్డ్ బాండ్ల (SGB)లో నేరుగా పెట్టుబడి పెట్టవచ్చు. దీని కోసం ఆర్‌బీఐ వద్ద 'రిటైల్ డైరెక్ట్ గిల్ట్' ఖాతాను తెరవాల్సి ఉంటుంది. లాభాలు ఇవి ప్రభుత్వ బాండ్లు కాబట్టి మీ పెట్టుబడికి ప్రభుత్వం గ్యారెంటీ ఉంటుంది. అంటే అసలు, వడ్డీ తిరిగి వస్తుందనే నమ్మకం ఉంటుంది. ఈ ఖాతా తెరవడానికి, దాన్ని నిర్వహించడానికి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. బ్రోకరేజ్ ఛార్జీలు కూడా ఉండవు. మధ్యవర్తులు లేకుండా నేరుగా ఆర్‌బీఐ నిర్వహించే ప్రైమరీ మార్కెట్ వేలంలో సామాన్యులు కూడా బిడ్లు దాఖలు చేయవచ్చు. ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే కొన్నిసార్లు మెరుగైన వడ్డీ రేట్లను పొందే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా దీర్ఘకాలిక పెట్టుబడుల విషయంలో ఇది సాధ్యమవుతుంది. సావరిన్ గోల్డ్ బాండ్ల ద్వారా ఫిజికల్ గోల్డ్ కంటే తక్కువ ధరకు, అదనపు వడ్డీతో బంగారంపై పెట్టుబడి పెట్టవచ్చు. (ఇటీవల కాలంలో బంగారం భారీగా పెరగడంతో ప్రభుత్వం సావరిన్ గోల్డ్ బాండ్లను నిలిపేసిందని గమనించాలి)

**పరిమితులు......**షేర్ మార్కెట్‌తో పోలిస్తే ప్రభుత్వ బాండ్లలో సెకండరీ మార్కెట్ లావాదేవీలు తక్కువగా ఉంటాయి. అంటే అత్యవసరంగా అమ్మాలనుకున్నప్పుడు కొనుగోలుదారులు త్వరగా దొరక్కపోవచ్చు.




మార్కెట్‌లో వడ్డీ రేట్లు పెరిగితే, మీరు గతంలో తక్కువ వడ్డీకి కొన్న బాండ్ల విలువ తగ్గుతుంది. దీన్ని మార్కెట్ రిస్క్ అంటారు. బాండ్ల ద్వారా వచ్చే వడ్డీపై మీ ఆదాయపు పన్ను స్లాబ్ ప్రకారం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఎఫ్‌డీల మాదిరిగానే దీనికి పన్ను మినహాయింపులు తక్కువ. యాప్‌ను వాడటం, బిడ్డింగ్ వేయడం వంటి ప్రక్రియలు గ్రామీణ లేదా తక్కువ అవగాహన ఉన్నవారికి కొంచెం క్లిష్టంగా అనిపించవచ్చు. **ఎవరికి మేలు?....**రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడని వారికి, తమ డబ్బు సురక్షితంగా ఉండాలనుకునే వారికి ఇది మెరుగైన వేదిక. నెలవారీ లేదా వార్షిక ఆదాయం కోసం దీర్ఘకాలిక ప్రభుత్వ బాండ్లలో పెట్టుబడి పెట్టడం ప్రయోజనకరం. కేవలం స్టాక్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్‌పైనే ఆధారపడకుండా తమ పెట్టుబడులను వైవిధ్యపరచాలనుకునే ఇన్వెస్టర్లకు ఇది సరైనది. పిల్లల చదువులు లేదా పెళ్లిళ్ల కోసం 1030 ఏళ్ల కాలపరిమితితో పెట్టుబడి పెట్టేవారికి ఇది ఉత్తమం. దీర్ఘకాలంలో ఈక్విటీ మార్కెట్లతో పోలిస్తే ప్రభుత్వ బాండ్లు తక్కువ మొత్తాన్ని సమకూర్చే అవకాశం ఉంది. **ప్రభుత్వ సెక్యూరిటీల రకాలు.....**ట్రెజరీ బిల్లులు.. ఇవి స్వల్పకాలిక పెట్టుబడులు (మెచ్యూరిటీ పీరియడ్ 91 రోజులు, 182 రోజులు లేదా 364 రోజులు). ప్రభుత్వ బాండ్లు.. ఇవి దీర్ఘకాలిక పెట్టుబడులు (5 ఏళ్ల నుంచి 40 ఏళ్ల వరకు ఉంటాయి). వీటికి స్థిరమైన వడ్డీ వస్తుంది. రాష్ట్ర అభివృద్ధి రుణాలు.. రాష్ట్ర ప్రభుత్వాలు తమ అవసరాల కోసం జారీ చేసే బాండ్లు. **వడ్డీ ఎంత?.....**ప్రభుత్వ సెక్యూరిటీలపై వడ్డీ రేటు స్థిరంగా ఉండదు. ఇది మార్కెట్ పరిస్థితులు, ఆర్‌బీఐ రెపో రేటు, కాలపరిమితిపై ఆధారపడి మారుతూ ఉంటుంది. ప్రస్తుత అంచనాల ప్రకారం.. సాధారణంగా వీటిపై వడ్డీ 7% నుంచి 7.5% మధ్యలో ఉండే అవకాశం ఉంది (ఇది మారుతూ ఉండవచ్చు). దీర్ఘకాలిక బాండ్లపై వడ్డీని (దీన్ని కూపన్ అంటారు) సాధారణంగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి మీ బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. ట్రెజరీ బిల్లులపై నేరుగా వడ్డీ ఉండదు. ఉదాహరణకు రూ.100 విలువైన బిల్లును ప్రభుత్వం రూ.98 కి అమ్ముతుంది. గడువు తీరాక మీకు రూ.100 ఇస్తుంది. ఆ రూ.2 మీ లాభం.

# హైదరాబాద్ విపణిలోకి బ్రిటైం లండన్ వాచీలు



లండన్‌కు చెందిన ఆటోమేటిక్ వాచీ బ్రాండ్ బ్రిటైం లండన్‌ను హైదరాబాద్ విపణిలోకి అందుబాటులోకి తెచ్చినట్లు రమేష్ వాచ్ కంపెనీ తెలిపింది. చేతి గడియారాలు ఇప్పుడు ఆభరణాలుగా మారాయని, వినియోగదారుల అభిరుచికి తగ్గట్టుగా అంతర్జాతీయ బ్రాండ్‌లను తీసుకొస్తున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ రోహిత్ చుగాని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో 11 స్టోర్లు ఉండగా, త్వరలోనే విశాఖపట్నంలో రెండు విక్రయ కేంద్రాలను ప్రారంభించబోతున్నట్లు పేర్కొన్నారు. 2028 నాటికి దేశ వ్యాప్తంగా 22కు పైగా కేంద్రాలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. చేతి గడియారాల విపణి ఏటా రూ.15 వేల కోట్ల వరకూ ఉందని, ఇది 20 శాతం వరకూ వృద్ధి చెందుతోందని తెలిపారు.

# నెలవారీ సిప్ (లేదా) ఒకేసారి పెద్దమొత్తం.. పెట్టుబడిలో ఏది బెటర్?

పెట్టుబడి ఎంత స్మార్ట్‌గా ఉంటే ఆదాయం అంత ఎక్కువగా ఉంటుంది. మీరు ఉద్యోగం చేస్తుంటే ప్రతి నెలా కొంత మొత్తం సిప్ (SIP) చేయొచ్చు. పెద్ద మొత్తంలో డబ్బు ఉంటే ఒకేసారి పెట్టుబడి పెట్టొచ్చు. అయితే, ఈ రెండింటిలో ఏది బెటర్ అనేది చాలా మంది సందేహం. ఉదాహరణకు, మీరు ప్రతి నెలా రూ.10 వేలు ఏడాది పాటు సిప్ చేస్తే.. 12 శాతం రాబడితో రూ.1,28,093 అవుతుంది. లాభం రూ.8093. అదే, మీరు రూ.1.20 లక్షలు ఒకేసారి పెట్టుబడి పెడితే.. 12 శాతం రాబడితో ఏడాదిలో రూ.1,34,400 అవుతుంది. లాభం రూ.14,400. అయితే, పెద్ద మొత్తాల్లో పెట్టుబడి పెట్టే ముందు రిస్క్ లెవెల్, మార్కెట్ పరిస్థితులు, మీ ఆర్థిక స్థితిగతులు అర్థం చేసుకోవాలి

# రాంకీ లాభం రూ.78 కోట్లు

నిర్మాణ, మౌలిక వసతుల రంగంలోని రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.550.70 కోట్ల ఆదాయం, రూ.78 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఈపీఎస్ రూ.11.35గా ఉంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.498.78 కోట్లు, నికర లాభం రూ.59.80 కోట్లుగా ఉన్నాయి. 202526 ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలలకు ఆదాయం రూ.1,519.88 కోట్లు, నికర లాభం రూ.230.66 కోట్లుగా ఉన్నాయి. డిసెంబరు 31, 2025తో ముగిసిన త్రైమాసికంలో, ఇకపై చెల్లించాల్సిన అవసరం లేదని భావించిన రూ.7.87 కోట్ల రుణాలను, అదనపు కేటాయింపులను కంపెనీ వెనక్కి తీసుకుంది. ఫలితాల సందర్భంగా సంస్థ సీఈఓ సునీల్ నాయర్ మాట్లాడుతూ.. వరసగా ప్రతి త్రైమాసికంలోనూ కంపెనీ పనితీరు స్థిరంగా మెరుగవుతోందన్నారు. బలమైన మార్జిన్లు, లాభదాయకత తమ నిర్వహణ సామర్థ్యానికి నిదర్శనం అని పేర్కొన్నారు. నీటి, పట్టణ మౌలిక వసతుల ప్రాజెక్టులపై దృష్టిసారిస్తున్నామని తెలిపారు. నిర్వహణ ఖర్చుల నియంత్రణ, సామర్థ్యం పెరగడంతో ఆదాయం, లాభాల్లో వృద్ధి సాధ్యమయిందని సీఎఫ్ఓ స్రవంత్ రాయపూడి పేర్కొన్నారు.

RAMKY INFRASTRUCTURE
Towards sustainable growth




# నన్ను నేను అంగీకరించడానికే ఎంతో సమయం

చిత్ర పరిశ్రమలోకి వచ్చిన కొంతకాలం వరకూ కూడా తనలో ఆత్మవిశ్వాసం చాలా తక్కువగా ఉండేదని, ఆ తర్వాతే అది పెరిగిందని చెబుతోంది మృణాల్ ఠాకూర్. ఆమె, సిద్ధాంత్ చతుర్వేది జంటగా నటించిన చిత్రం 'దో దివానే సెహర్ మే'. రవి ఉద్యావర్ తెరకెక్కించిన ఈ చిత్రం ఈ నెల 20న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న మృణాల్ మాట్లాడుతూ.. ''చిన్నప్పటి నుంచే నాకు కొంచెం ఆత్మవిశ్వాసం తక్కువగా ఉండేది. చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన తర్వాత కూడా అంటే.. ఇటీవలే విడుదలైన నా సినిమా 'సన్ ఆఫ్ సర్దార్ 2' వరకు కూడా నేను అలానే భావించేదాన్ని. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. నన్ను నేను అంగీకరించడానికి, అందంగా ఉన్నానని తెలుసుకోవడానికి నాకు ఇంత సమయం పట్టిందా అనిపిస్తుంద''ని అంది.




# కఠిన విమర్శలైనా.. మార్చుకుంటాను

విమర్శల నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించినప్పుడు.. వ్యక్తిగతంగా సవాలుగా అనిపిస్తోందీ అంటోంది బాలీవుడ్ తార శనయా కపూర్. బాలీవుడ్ విలక్షణ నటుడు సంజయ్ కపూర్ కుమార్తె శనయ గతేడాది 'ఆంఖోన్ కి గుస్తాఖియాన్' సినిమాతో కథానాయికగా హిందీ చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె చిత్రపరిశ్రమలో ఎదురయ్యే ట్రోల్స్ గురించి పలు అంశాల్ని పంచుకుంది. ''నేను ప్రేక్షకుల అభిప్రాయాలను గౌరవిస్తాను. నా నటన గురించి వాళ్లు ఏమనుకుంటున్నారో తెలుసుకోకుండా ఉంటే ఇండస్ట్రీలో నేను ఎలా రాణించగలను. చిత్రసీమలోకి వచ్చాక వివిధ రకాల విమర్శలు ఎదురవుతుంటాయని నాకు తెలుసు. అవి నా నటనపై వ్యక్తపరిచిన అభిప్రాయాలు అయితే.. వాటిని చాలా కఠినంగా వ్యక్తపరిచినా నేను వాటిని మార్చుకోవాలి అనుకుంటా. కానీ కొన్ని విమర్శలు వ్యక్తిగతంగా నా అందం గురించి ఉంటాయి. ఇలాంటివి విన్నప్పుడు కొంచెం ఎక్కువ బాధ కలుగుతుంది. అప్పుడు నాకు అత్యంత సన్నిహితురాలు నా తల్లితో ఈ విషయాల్ని పంచుకుంటాను. ఇండస్ట్రీలో ఇలాంటి పరిస్థితులు ఎదురవుతాయి కాబట్టి బాధ కలిగినా వాటిని అంగీకరించడమనేది చాలా ముఖ్యం''అని చెప్పుకొచ్చింది. సర్వైవల్ డ్రామాగా రూపొందిన 'తు యా మే' చిత్రంతో ఈ నెల 13న ప్రేక్షకుల్ని పలకరించనుందీ శనయ.

## ట్రైలర్‌తోనే సినిమా చూడాలనే ఇంట్రెస్ట్ వస్తుంది.. "అమరావతికి ఆహ్వానం"పై హీరో కామెంట్స్



శివ కంఠంనేని, ధన్య బాలకృష్ణ జంటగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'అమరావతికి ఆహ్వానం'. డైరెక్టర్ జీవీకే ఈ మూవీని తెరకెక్కించారు. లైట్ హౌస్ సినీ మ్యాజిక్ బేనర్‌పై కేఎస్ శంకర్‌రావు, ఆర్ వెంకటేశ్వర రావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. దీంతో తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా ప్రముఖ నటులు, నిర్మాత మురళి మోహన్, యంగ్ హీరో అశ్విన్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా మురళీ మోహన్ మాట్లాడుతూ.. 'తెలుగు సినిమా ఖ్యాతి విశ్వవ్యాప్తమైంది. మనం ఆస్కార్ రేంజ్ సినిమాలు చేస్తున్నాం. అయితే అలాంటి భారీ చిత్రాలతో పాటు చిన్న సినిమాలు కూడా పరిశ్రమకు అవసరం. మా మిత్రులు శివ కంఠంనేని, వెంకటేశ్వరరావు నిర్మించిన 'అమరావతికి ఆహ్వానం' సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా' అన్నారు.హీరో అశ్విన్ బాబు మాట్లాడుతూ.. 'అమరావతికి ఆహ్వానం సినిమా ట్రైలర్ చాలా బాగుంది. ట్రైలర్ తోనే సినిమా చూడాలనే ఆసక్తిని డైరెక్టర్ క్రియేట్ చేశారు. ముగ్గురు హీరోయిన్స్‌తో ఇలాంటి మూవీ చేయడం సులువైన పని కాదు. మేము రాజు గారి గది సినిమా చేసినప్పుడు ఇలాంటి చిన్న బడ్జెట్ తోనే చేశాం. ఆ మూవీని మీరంతా ఆదరించారు. ఈ చిత్రానికి కూడా అలాంటి సక్సెస్ ఇవ్వాలని కోరుకుంటున్నాం' అని తెలిపారు.

## క్రేజీ కాంబో.. ప్రోమోతో సిద్ధమా!



కథానాయకులు రజనీకాంత్ కమల్‌హాసన్ కలిసి నటించనున్న మల్టీస్టారర్ కోసం సినీప్రియులంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రేజీ కాంబోలో రూపొందనున్న సినిమాకి నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించనున్నట్లు ఇప్పటికే వార్తలొచ్చాయి.

'ఈ ప్రాజెక్ట్ చర్చల దశలో ఉంద'ని సౌందర్య రజనీకాంత్ కూడా ఇటీవల స్పష్టత ఇవ్వడంతో దీనిపై అంచనాలు రెట్టింపయ్యాయి. అయితే ఇప్పుడీ చిత్రానికి సంబంధించి మరో ఆసక్తికర వార్త బయటకొచ్చింది. ఈ సినిమా ప్రకటనకు సంబంధించిన ప్రోమో చిత్రీకరణ చెన్నైలో మొదలైందని సమాచారం. దీనికోసం ఓ ప్రత్యేక సెట్‌ను సిద్ధం చేసినట్లు తెలిసింది. త్వరలోనే ఈ ప్రచార చిత్రంతోనే ఈ మల్టీస్టారర్‌ను అధికారికంగా ప్రకటించనున్నారని తెలుస్తోంది. దీన్ని రెడ్ జెయింట్ మూవీస్, రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా నిర్మించే అవకాశముంది.

## ఏప్రిల్‌లోనే 'భూత్‌బంగ్లా'లోకి...

'హేరాఫేరీ' చిత్రం తర్వాత బాలీవుడ్ అగ్ర నటులు అక్షయ్ కుమార్, టబు 26ఏళ్ల తర్వాత తిరిగి తెరని పంచుకోనున్న చిత్రం 'భూత్ బంగ్లా'. ఈ సినిమాకి ప్రియ దర్శన్ దర్శకత్వం వహిస్తున్నారు. మే 15న రావాల్సిన ఈ సినిమాని కొత్త విడుదల తేదీతో ముందుగానే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తాజాగా ప్రకటించింది చిత్రబృందం. ఈ సినిమా ఏప్రిల్ 10న థియేటర్లలో విడుదల కానుందని అధికారికంగా పేర్కొంటూ ఇన్‌స్టాలో ఓ వీడియోను ఆవిష్కరించింది. అక్షయ్ కుమార్ ప్రధానపాత్రలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో పరేష్‌రావల్, వామికా గబ్బి, రాజ్‌పాల్ యాదవ్ తదితరులు కీలకపాత్రల్లో నటిస్తున్నారు.

# బరిలోకి దిగుతున్న 'సంక్రాంతి సోగ్గాళ్లు'

'సోగ్గాడే చిన్ని నాయనా' సీక్వెల్‌ను అధికారికంగా అన్నపూర్ణ స్టూడియో ప్రకటించింది. అయితే, పూర్తి క్లారిటీ కాకుండా ఒక పంచ్ డైలాగ్‌తో పోస్ట్ చేశారు. 2016 సంక్రాంతి కానుకగా విడుదలైన 'సోగ్గాడే చిన్ని నాయనా' భారీ హిట్ అందుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత 2022 సంక్రాంతికి సీక్వెల్‌గా బంగార్రాజు వచ్చాడు. అయితే, 2027 సంక్రాంతికి మరో సీక్వెల్ రానుందని తాజాగా చిత్ర నిర్మాణ సంస్థ వెల్లడించింది. వాసివాడి తస్సాదియ్యా అంటూ.. 2027 జనవరి 15న సంక్రాంతికి సోగ్గాళ్లు వస్తే పండగ ఇంకా కలర్ ఫుల్‌గా ఉంటాది కదా అని డేట్ మార్క్ చేసుకోమని పోస్ట్ చేశారు. దర్శకుడు కల్యాణ్‌కృష్ణ కురసాల 'సోగ్గాడే చిన్ని నాయనా' చిత్రంతో తొలి ప్రయత్నంలోనే అందరి దృష్టినీ ఆకర్షించి హిట్ కొట్టడమే కాకుండా బంగార్రాజు సీక్వెల్‌తో మెప్పించాడు. దీంతో ఇదే ఫ్రాంచైజీలో మరో సినిమా రానుందని వార్తలు వస్తున్న నేపథ్యంలో తాజాగా చిత్ర నిర్మాణ సంస్థ చేసిన పోస్ట్‌తో ఒక క్లారిటీ ఇచ్చేసింది. కల్యాణ్‌కృష్ణ, నాగార్జున కలిసి పార్ట్3 ప్లాన్ చేస్తున్నారని తెలుస్తోంది. త్వరలో మరిన్ని విషయాలు వెల్లడించే ఛాన్స్ ఉంది. రాబోయే సంక్రాంతికి సీనియర్ హీరోలు అందరూ పోటీలో ఉన్నారు. చిరంజీవి బాబీ సినిమాతో పాటు బాలకృష్ణ గోపీచంద్ మలినేని, వెంకటేశ్ అనిల్ రావిపూడి సినిమాలు రేసులో ఉన్న విషయం తెలిసిందే.



## అజిత్‌తో శివకార్తికేయన్.. స్ఫూర్తిదాయకమంటూ పోస్టు

అబుదాబిలో జరుగుతున్న 'యాస్ స్పీడ్ ఫెస్టివల్'లో ప్రముఖ నటుడు, ప్రొఫెషనల్ రేసర్ అజిత్‌ను మరో నటుడు శివకార్తికేయన్ కలిశారు. ఆయనతో దిగిన ఫొటోలను అభిమానులతో పంచుకుంటూ.. 'స్ఫూర్తిదాయకమైన వ్యక్తితో ఒకరోజు' అంటూ ఆనందం వ్యక్తం చేశారు. చేసే పనిపై ఆసక్తి, అంకితభావం అంటే ఏంటో ప్రత్యక్షంగా చూశానంటూ అజిత్‌ను కొనియాడారు. ఈ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. 'కాంబినేషన్ అదిరింది' అంటూ ఈ హీరోల ఫ్యాన్స్ సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు. రేసింగ్‌లో అజిత్ టీమ్ అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటిన సంగతి తెలిసిందే. అబుదాబిలోని యాస్ మెరినా సర్క్యూట్‌లో జరుగుతున్న రేస్‌లో పాల్గొంది. నేటి (ఫిబ్రవరి 8) ఫెస్టివల్ పూర్తికానుంది. అజిత్ రేసింగ్ కెరీర్‌పై ఓ ప్రాజెక్టు తెరకెక్కించనున్నట్లు దర్శకుడు ఎ.ఎల్. విజయ్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పడం గమనార్హం. సినిమాల విషయానికొస్తే..



గతేడాది 'విదాముయార్చి', 'గుడ్ బ్యాడ్ అగ్లీ'తో ప్రేక్షకుల ముందుకొచ్చారు అజిత్. శివ కార్తికేయన్ లేటెస్ట్ మూవీ 'పరాశక్తి' జనవరిలో థియేటర్లలో విడుదలైంది. ప్రస్తుతం ఓటీటీ 'జీ 5'లో స్ట్రీమింగ్ అవుతోంది.

## ఓ మలుపులా మమ్ముట్టి పాత్ర

''కుటుంబం, స్నేహితులతో కలిసి చూడాల్సిన సినిమా 'చథా పచ్చ: ది రింగ్ ఆఫ్ రౌడీస్'' అన్నారు నటుడు రోషన్ మాథ్యూ. ఈ చిత్రం కోసం ప్రత్యేకంగా నాలుగు నెలల పాటు రెజ్లింగ్‌లో శిక్షణ తీసుకున్నట్లు తెలిపారు. ఆయన.. విశాఖ్ నాయర్, ఇషాన్ ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ సినిమాని అద్వైత్ నాయర్ తెరకెక్కించారు. ఇప్పటికే మలయాళంలో విడుదలైన ఈ చిత్రం సురేశ్ ప్రొడక్షన్స్ ద్వారా ఈ నెల 13న తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రోషన్ మాథ్యూ మాట్లాడుతూ.. ''అందర్నీ ఆకట్టుకునే మంచి క్రీడా నేపథ్య చిత్రమిది. ఇందులో ఓ ప్రత్యేక అతిథి పాత్ర ఉంది. దానికోసం మమ్ముట్టిని సంప్రదించడం.. ఆయన చేసేందుకు ఒప్పుకోవడం గొప్ప విషయం. తన పాత్ర ఈ చిత్రానికి ఓ మలుపులా ఉంటుంది. ఈ సినిమా ఇప్పటికే మలయాళంలో మంచి స్పందన దక్కించుకుంది. ఇప్పుడు తెలుగు ప్రేక్షకులు కూడా ఆస్వాదిస్తారని నమ్ముతున్నా'' అన్నారు.

## ఈ కథ చిరంజీవికి బాగా తెలుసు.. విజయ్ సేతుపతిని అనుకున్నా కానీ: అర్జున్

దర్శకుడిగా కొంతకాలం విరామం తర్వాత నటుడు అర్జున్ తెరకెక్కించిన సినిమా 'సీతాపయనం' . నిరంజన్, అర్జున్ కుమార్తె ఐశ్వర్య ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా అర్జున్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. హీరో చిరంజీవికి ఈ స్టోరీ బాగా తెలుసు అని, ఆయనకు ఎంతో ఇష్టమని తెలిపారు. ఇందులోని ఓ కీలక పాత్ర కోసం మంచి ఆర్టిస్ట్‌ను ఎంపిక చేయమని చిరంజీవి సూచించారని చెప్పారు. ఆ మేరకు కోలీవుడ్ నటుడు విజయ్ సేతుపతిని తీసుకోవాలని అనుకోగా.. డేట్స్ సర్దుబాటు కాక పోవడం వల్ల ఆయన నటించలేకపోయారని అన్నారు. దీంతో, ఆ పాత్రకు సంబంధించి కొన్ని మార్పులు చేసి.. తానే ఆ రోల్ ప్లే చేసినట్లు తెలిపారు. 'ప్రేమ బరహా' (2018) తర్వాత అర్జున్ డైరెక్ట్ చేసిన సినిమా ఇదే. 1992లోనే 'సేవగన్'తో ఆయన దర్శకుడిగా మారిన సంగతి తెలిసిందే. నటుడిగా గతేడాది 'విదాముయార్చి' (తెలుగులో పట్టుదల), 'అగత్యా' తదితర సినిమాలతో ప్రేక్షకులను పలకరించారు. డైరెక్టర్‌గా అర్జున్‌కు,



హీరోయిన్‌గా ఐశ్వర్యకు ఇదే తొలి తెలుగు చిత్రం. ప్రేమ, కుటుంబ విలువల నేపథ్యంతో రూపొందిన ఈ సినిమాలో అర్జున్ మేనల్లుడు, కన్నడ హీరో ధ్రువ్ సార్జా అతిథి పాత్ర పోషించడం విశేషం.

## బక్రీద్‌కు రిలీజ్ కానున్న స్టార్ హీరో సినిమా..? పోస్ట్ తో హైప్..!

దుల్కర్ సల్మాన్‌ప్రస్తుతం నటిస్తున్న సినిమా 'ఆకాశంలో ఒక తార'. దర్శకుడు పవన్ సాదినేని డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాను గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా బ్యానర్లు సమర్పిస్తుండగా లైట్ బాక్స్ మీడియా బ్యానర్‌పై సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఇక దీనికి జి.వి.ప్రకాష్ కుమార్‌సంగీతం అందిస్తున్నాడు. ఇక సాత్విక వీరవల్లి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీ తెలుగు, మలయాళం, తమిళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఇక ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన అప్డేట్స్ ఆకట్టుకున్నాయి. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోన్న ఈ సినిమాకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఆకాశంలో ఒక తార సినిమా క్లైమాక్స్ షూటింగ్ చిన్న షెడ్యూల్ లో జరుగుతోందట. బక్రీద్ స్పెషల్‌గా ఈ సినిమా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. ఇక అప్పటిలోపు షూటింగ్‌తో పాటు అన్నీ పనులు కంప్లీట్ చేసుకుని సినిమా రిలీజ్ చేయడానికి ప్లాన్



చేస్తున్నారట. ప్రస్తుతం ఈ న్యూస్ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# ఇలవేనిల్ జోడీకి స్వర్ణం




ఆసియా షూటింగ్ (రైఫిల్/ పిస్టల్) ఛాంపియన్‌షిప్‌లో భారత మిక్స్‌డ్ జట్టు మెరిసింది. ఒలింపియన్లు ఇలవేనిల్ అర్జున్ బబుతా జోడీ స్వర్ణ పతకం సాధించింది. ఆదివారం 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో ఇలవేనిల్ బబుతా (505.0) జంట అగ్రస్థానం సాధించింది. దక్షిణ కొరియా జోడీ (501.0) రజతం, జపాన్ జంట (437.1) కాంస్యం నెగ్గాయి. జూనియర్ విభాగంలో హిమాన్షు ధిల్లాన్ శాంభవి క్షీరసాగర్ జట్టు కాంస్యం కైవసం చేసుకుంది. 10 మీ ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో హిమాన్షు శాంభవి (502.4) అగ్రస్థానం సాధించింది. కజకిస్థాన్ (488.6) రెండు, మాల్దీవులు మూడో స్థానంలో నిలిచాయి. 25 మీ స్టాండర్డ్ పిస్టల్‌లో రియో ఒలింపియన్ గుర్‌ప్రీత్‌సింగ్ స్వర్ణం, హర్ష్ గుప్తా రజతం, అమన్‌ప్రీత్‌సింగ్ కాంస్యం సొంతం చేసుకున్నారు. జూనియర్స్‌లో సూరజ్ శర్మ, ముకేశ్ నేలవల్లి, తనిష్క్ మురళీధర్ నాయుడు వరుసగా స్వర్ణ, రజత, కాంస్యం సాధించారు.

# యువ ఛాంపియన్లకు ఘనస్వాగతం



యువ ఛాంపియన్లు భారత్‌కు చేరుకున్నారు. అండర్19 ప్రపంచకప్ నెగ్గిన కుర్రాళ్లకు.. ఆదివారం ముంబయి ఎయిర్‌పోర్టులో కుటుంబ సభ్యులు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. గురువారం అండర్19 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఆయుష్ మాత్రే సేన.. 100 పరుగుల తేడాతో ఇంగ్లాండ్‌ను ఓడించిన సంగతి తెలిసిందే. ఈ టోర్నీలో భారత్ ఒక్క మ్యాచ్‌లోనూ పరాజయం చవిచూడకుండా కప్పు గెలవడం విశేషం. బీసీసీఐ త్వరలో విజయోత్సవ కార్యక్రమం నిర్వహించే అవకాశం ఉంది. గతంలో భారత్ 2000, 2008, 2012, 2018, 2022లో ఛాంపియన్‌గా నిలిచింది. ''ఆనందంతో మాకు మాటలు రావడం లేదు. మా అబ్బాయి చిన్నప్పటి నుంచి పడ్డ శ్రమకు ఫలితం దక్కింది'' అని ఆయుష్ మాత్రే తండ్రి అన్నారు. కోచ్ హృషికేశ్ కనిత్కర్ శిక్షణలో ట్రోఫీ నెగ్గిన భారత కుర్రాళ్లకు బీసీసీఐ రూ.7.5 కోట్ల నగదు బహుమతిని ప్రకటించింది. ఫైనల్లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ 80 బంతుల్లో



175 పరుగుల విధ్వంసక ఇన్నింగ్స్ ఆడిన సంగతి తెలిసిందే.

# వణికించిన నేపాల్

## ప్రపంచకప్‌లో తప్పిన సంచలనం త్రుటిలో బయటపడ్డ ఇంగ్లాండ్

టీ20 ప్రపంచకప్‌లో చిన్న జట్లు ఎంతో మెరుగైన ప్రదర్శనే చేస్తున్నాయి. గెలుపు అవకాశాలు సృష్టించుకుంటున్నాయి. విజయానికి చేరువగా వెళ్తున్నాయి. కానీ ఆఖర్లో తడబడి ఓటమి పాలవుతున్నాయి. తొలి రోజు నెదర్లాండ్స్, స్కాట్లాండ్, అమెరికా పోరాడి ఓడగా.. రెండో రోజు అఫ్గానిస్థాన్, నేపాల్, ఐర్లాండ్ ఇదే బాటలో సాగాయి. ఆదివారం నేపాల్ జట్టు.. ఇంగ్లాండ్‌ను దాదాపు ఓడించినంత పని చేసింది. ఆ జట్టు కేవలం 4 పరుగుల తేడాతో ఓడింది. న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్, శ్రీలంకతో పోరులో ఐర్లాండ్ కూడా బాగా ఆడినా.. ఓటమిని తప్పించుకోలేకపోయాయి. ఈ ప్రపంచకప్‌లో తక్కువ అంచనాలున్న జట్లలో ఒకటి నేపాల్. పెద్ద జట్లకు కనీస పోటీ ఇస్తుందని కూడా ఎవరూ అనుకోలేదు. కానీ కూనే అనుకుంటే ఆ జట్టు అదరగొట్టింది. టోర్నీలో తన తొలి మ్యాచ్‌లో రెండుసార్లు ఛాంపియన్ ఇంగ్లాండ్‌ను వణికించింది. నేపాల్ అద్భుత పోరాటంతో ఇంగ్లిష్ జట్టును దాదాపు ఓడించినంత పనిచేసింది. అనూహ్య ప్రతిఘటన ఎదుర్కొన్న ఇంగ్లాండ్.. ఓటమి అంచుల్లో నుంచి అతికష్టంగా బయటపడి బతుకు జీవుడా అనుకుంది. టీ20 ప్రపంచకప్‌లో త్రుటిలో సంచలనం తప్పింది. ఉత్కంఠభరితంగా సాగిన గ్రూప్‌సి పోరులో ఇంగ్లాండ్ 4 పరుగుల తేడాతో నేపాల్‌పై కష్టంగా గెలిచింది. బెతెల్ (55; 35 బంతుల్లో 4×4, 4×6), హ్యారీ బ్రూక్ (53; 32 బంతుల్లో 4×4, 3×6), విల్ జాక్స్ (39 నాటౌట్; 18 బంతుల్లో 1×4, 4×6) మెరవడంతో ఆదివారం మొదట ఇంగ్లాండ్ 7 వికెట్లకు 184 పరుగులు చేసింది.. ఛేదనలో నేపాల్ 6 వికెట్లకు 180 పరుగులు చేసింది. దీపేంద్ర ఐరీ (44; 29 బంతుల్లో 6×4, 1×6) టాప్ స్కోరర్. లోకేశ్ బామ్ (39 నాటౌట్; 20 బంతుల్లో 4×4, 2×6), రోహిత్ పౌడెల్ (39; 34 బంతుల్లో 2×4, 2×6) రాణించారు. డాసన్ (2/21), సామ్ కరన్ (1/27) కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. జాక్స్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

**నేపాల్ పోరాటం:** ఛేదనలో కుశాల్ భుర్తెల్ (29; 17 బంతుల్లో 4×4, 1×6) విరుచుకుపడడంతో నేపాల్ 3 ఓవర్లకే 31/0తో నిలిచింది. అయితే అతడు, మరో ఓపెనర్ ఆసిఫ్ షేక్ (7) కొద్ది తేడాలో ఔటైనా.. కెప్టెన్ రోహిత్ పౌడెల్, దీపేంద్ర ఐరీ దూకుడుగా బ్యాటింగ్ చేయడంతో 14 ఓవర్లు ముగిసే సరికి 123/2తో నేపాల్ సంచలన విజయంపై కన్నేసింది. ఇంగ్లాండ్‌కు ఆందోళన తప్పలేదు. కానీ ఆ జట్టు నిలదొక్కుకున్న ఇద్దరు బ్యాటర్లతో పాటు ఆరిఫ్ షేక్ (10)ను వెంటవెంటనే వెనక్కి పంపింది. 18వ ఓవర్లో 146/5తో నిలిచింది నేపాల్. ఆఖరి 16 బంతుల్లో 39 పరుగులు చేయాల్సిన పరిస్థితి. అయితే కాస్త ఊపిరి పీల్చుకున్న ఇంగ్లాండ్‌ను విధ్వంసక బ్యాటింగ్‌తో హడలెత్తించాడు లోకేశ్ బామ్. ఆర్చర్ బౌలింగ్‌లో అతడు వరుసగా రెండు సిక్స్‌లు బాదడంతో చివరి రెండు ఓవర్లలో నేపాల్‌కు 24 పరుగులు అవసరమయ్యాయి. గుల్షన్ ఝా (1) ఔటైనా.. జోరు కొనసాగిస్తూ లోకేశ్ రెండు ఫోర్లు దంచడంతో 19వ ఓవర్లో (వుడ్) నేపాల్‌కు 14 పరుగులు వచ్చాయి. ఆఖరి ఓవర్లో పది పరుగులు చేయాల్సిన స్థితిలో నేపాల్‌ను విజయం ఊరించింది. కానీ చివరి ఓవర్లో సామ్ కరన్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. కేవలం 5 పరుగులే ఇచ్చి ఇంగ్లాండ్‌కు విజయాన్నందించాడు.

**ఇంగ్లాండ్ ఇన్నింగ్స్:** ఫిల్ సాల్ట్ (సి) లమిచానె (బి) మల్లా 1; బట్లర్ (సి) అసిఫ్ షేక్ (బి) నందన్ యాదవ్ 26; బెతెల్ (సి) లోకేశ్ (బి) ఐరీ 55; టామ్ బాంటన్ ఎల్బీ (బి) లమిచానె 2; బ్రూక్ (సి) మల్లా (బి) నందన్ యాదవ్ 53; సామ్ కరన్ (బి) ఐరీ 2; విల్ జాక్స్ నాటౌట్ 39; ఆర్చర్ రనౌట్ 1; డాసన్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 5 మొత్తం: (20 ఓవర్లలో 7 వికెట్లకు) 184; వికెట్ల పతనం: 15, 243, 357, 4128, 5137, 6157, 7178; బౌలింగ్: కేసీ కరణ్ 30350; షేర్ మల్లా 30351; దీపేంద్ర సింగ్ ఐరీ 30232; నందన్ యాదవ్ 30252; లమిచానె 40251; కుశాల్ భుర్తెల్ 4-040-0

**నేపాల్ ఇన్నింగ్స్:** కుశాల్ భుర్తెల్ (సి) అండ్ (బి) జాక్స్ 29; అసిఫ్ షేక్ (సి) వుడ్ (బి) డాసన్ 7; రోహిత్ పౌడెల్ (సి) సాల్ట్ (బి) డాసన్ 39; దీపేంద్ర సింగ్ ఐరీ (సి) బాంటన్ (బి) సామ్ కరన్ 44; ఆరిఫ్ షేక్ (సి) బట్లర్ (బి) ఆర్చర్ 10; లోకేశ్ బామ్ నాటౌట్ 39; గుల్షన్ ఝా (బి) వుడ్ 1; కేసీ కరణ్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 10 మొత్తం: (20 ఓవర్లలో 6 వికెట్లకు) 180; వికెట్ల పతనం: 137, 242, 3124, 4126, 5146, 6175; బౌలింగ్: ల్యూక్ వుడ్ 30311; ఆర్చర్ 40421; లయామ్ డాసన్ 40212; విల్ జాక్స్ 20171; అదిల్ రషీద్ 30420; సామ్ కరన్ 4-0-27-1

# భారత్‌లో తొలిసారిగా..కిక్ బాక్సింగ్ లీగ్




భారత్‌లో తొలిసారిగా కిక్ బాక్సింగ్ సూపర్ లీగ్( కేఎస్ఎల్) జరగబోతుంది. ఈ మేరకు దిల్లీలో లీగ్ ప్రారంభోత్సవ వేడుకలు జరిగాయి. వాకో ఇండియా నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరుగుతున్న వేళ కేఎస్ఎల్‌ను ప్రారంభించారు. భారత్‌లో కిక్ బాక్సింగ్‌ను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ లీగ్‌ను తీసుకొచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ''నిర్మాణాత్మక పోటీలు, అథ్లెట్లకు కాంట్రాక్టులు, ప్రతిభకు ప్రోత్సాహకాలు, మారుమూల క్రీడాకారులకు మంచి అవకాశాలు కల్పిస్తూ భారత్‌లో కిక్‌బాక్సింగ్‌కు గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా కేఎస్ఎల్‌ను ప్రారంభించాం. సీజన్ 1లో ఎనిమిది ఫ్రాంచైజీ జట్లు ఉంటాయి. ఒక్కో జట్టులో 34 మంది ఫైటర్లుంటారు. ఈ లీగ్‌లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. క్రీడాకారుల్లో 60 శాతం పురుషులు, 40 శాతం మహిళలుంటారు. 20 శాతం అంతర్జాతీయ అథ్లెట్లు పాల్గొనే అవకాశం ఉంది. ఈ లీగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి రూ. కోటి నగదు బహుమతి ఉంటుంది''అని నిర్వాహకులు తెలిపారు. కేఎస్ఎల్ సహవ్యవస్థాపకుడు అజయ్ అద్లఖ మాట్లాడుతూ.. ఈ లీగ్‌ను ఎంతో పటిష్ఠంగా, పారదర్శకంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. దీని ద్వారా అథ్లెట్‌స్‌కు, జట్లకు, భాగస్వాములకు లాభం చేకూరుతుందన్నారు. కేఎస్ఎల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ ప్రతినిధులు, జాతీయ క్రీడాశాఖ అధికారులు, క్రీడాకారులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు. ఈ లీగ్‌లో పాల్గొనాలంటే క్రీడకారులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత దేశవ్యాప్తంగా క్యాంపులు ఏర్పాటు చేసి.. క్రీడాకారుల్ని ఎంపిక చేస్తారు. ఆ తర్వాత క్రీడాకారుల వేలం ఉంటుంది. జట్ల యాజమాన్యాలతో క్రీడాకారులకు సీజన్ వారీగా కాంట్రాక్టులు ఉంటాయి.

# టీమ్ఇండియా చాలా నేర్చుకోవాలి! ..సునీల్ గావస్కర్



ముంబయిలోని వాంఖడే స్టేడియం వేదికగా శనివారం యూఎస్ఏతో జరిగిన మ్యాచ్‌లో టీమ్ఇండియా బ్యాటర్లు తడబడిన విషయం తెలిసిందే. 12.4 ఓవర్ల సమయానికి భారత జట్టు 6 వికెట్లు కోల్పోయి 77 పరుగులు మాత్రమే చేసి, పీకల్లోతు కష్టాల్లో ఉన్నట్లు కనిపించింది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వీరోచితంగా ఒంటరి పోరాటం చేయడంతో భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ 49 బంతుల్లో 84 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అమెరికా జట్టు 132 పరుగులకే పరిమితమైన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో తడబాటుకు గురైన నేపథ్యంలో భారత్ మరింత మెరుగ్గా తన బ్యాటింగ్ ప్రణాళికలను రూపొందించుకోవాలని టీమ్ఇండియా మాజీ క్రికెటర్ సునీల్‌గావస్కర్ సూచించాడు. 'నా దృష్టిలో 160 స్కోర్ చేయడం తేలిక కాదు. టీమ్ఇండియా మంచి మార్జిన్‌తోనే (29 పరుగులు) గెలిచింది. అయితే భారతజట్టు ఈ మ్యాచ్ నుంచి చాలా నేర్చుకోవాలి. బ్యాటింగ్ డెప్త్ ఉంది. కానీ పవర్‌ప్లేలో తేలిగ్గా వికెట్లు సమర్పించుకోవడం సమంజసం కాదు' అని సునీల్ గావస్కర్ పేర్కొన్నాడు. 'ఎనిమిది మంది బ్యాటర్లతో భారత్ బరిలోకి దిగితే, ముగ్గురు మాత్రమే బౌలర్లుంటారు. 7 8 ఓవర్లలోనే నాలుగు వికెట్లు కోల్పోతే జట్టుకు పెద్ద సమస్య అవుతుంది. పవర్‌ప్లే ఆరు ఓవర్లు ఉంటుందనేది వాస్తవమే. కానీ జట్టులో.. ఎనిమిది మంది బ్యాటర్లుంటే అందులో నలుగురి వికెట్లను పవర్‌ప్లేలోనే కోల్పోవడం కరెక్ట్ కాదు. అలా అయితే మనల్ని మనమే ఒత్తిడిలోకి నెట్టుకున్నట్లవుతుంది' అని సునీల్ గావస్కర్ విశ్లేషించాడు.

# సూర్య కుమార్ తన ఫామ్‌లోకి వచ్చాడు.. ఆ పరుగులు ప్రత్యేకం: రవిచంద్రన్ అశ్విన్




టీ20 ప్రపంచకప్‌లో భాగంగా యూఎస్ఏతో శనివారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ జట్టును ఓటమి నుంచి కాపాడాడు. కష్ట సమయంలో తనదైన శైలిలో బ్యాటింగ్ చేసి.. 49 బంతుల్లో 84 పరుగులతో అజేయంగా నిలిచాడు. మొత్తం భారత జట్టు స్కోర్‌లో 52 శాతం పరుగులు సూర్య బ్యాట్ నుంచే రావడం విశేషం. భారత్ 77/6 స్థితి నుంచి 161 పరుగులకు చేరడంలో, జట్టు విజయం సాధించడంలో సూర్య కీలక పాత్ర పోషించాడు. మ్యాచ్ అనంతరం భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ సూర్య ఇన్నింగ్స్‌పై ప్రశంసలు కురిపించాడు. గతేడాది నిరాశాజనక ఫామ్ తర్వాత సూర్య.. తిరిగి ఫామ్‌లోకి వచ్చాడని కొనియాడాడు. సూర్య.. వికెట్ల వెనుక నుంచి పరుగులు రాబట్టడం ఈ మ్యాచ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని చెప్పాడు. తన యూట్యూబ్ ఛానల్ 'యాష్ కి బాత్' కార్యక్రమంలో అశ్విన్ మాట్లాడాడు. ''మొదట అమెరికా జట్టును అభినందించాల్సిందే. వాంఖడే స్టేడియం లాంటి సాధారణ బ్యాటింగ్‌కు అనుకూలమైన మైదానంలోనూ ఆ జట్టు బౌలర్లు సరైన ప్రణాళికతో వచ్చారు. షాడ్లీ వేగంగా బంతులు వేయలేదు. కానీ, కట్టర్లు.. వేరియంట్‌స్‌తో బౌలింగ్ చేశాడు. సూర్య కోసం ప్రత్యేక ప్రణాళికతో బౌలింగ్ చేసినట్లు అర్థమవుతుంది. సూర్య క్రీజులోకి వచ్చాక మొదట ఆచితూచి ఆడాడు. పరుగులు తీసేందుకు కొంత ఇబ్బంది పడ్డాడు. 31 బంతుల్లో 45 పరుగులు చేయగలిగాడు. డెత్ ఓవర్లలో విజృంభించి.. 16 బంతుల్లోనే 38 పరుగులు రాబట్టాడు. అమెరికా జట్టులో ఉత్తమ బౌలరైన సౌరభ్ నేత్రావల్కర్‌ను ధైర్యంగా ఎదుర్కొన్నాడు. సూర్య చేసిన పరుగుల్లో 37 శాతం స్కోర్ వికెట్ల వెనుక నుంచే రావడం విశేషం. ఇది నిజమైన 360 డిగ్రీ మాస్టర్ క్లాస్ బ్యాటింగ్. గతంలో కొన్ని జట్లు ఆ ఏరియాలోనే సూర్యని కట్టడి చేశాయి. కానీ, ఈ మ్యాచ్‌లో అతడు సమయం తీసుకున్నా.. మంచి ఫామ్‌లోకి వచ్చాడు. కెప్టెన్‌గా అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు''అని అశ్విన్ తెలిపాడు. సూర్య బ్యాటింగ్ పక్కన పెడితే.. భారత జట్టుకు ఈ మ్యాచ్ ఒక హెచ్చరికగా నిలుస్తుందని అశ్విన్ వ్యాఖ్యానించాడు. పవర్‌ప్లేలోనే నాలుగు వికెట్లు కోల్పోవడం ఆందోళనకర విషయమన్నాడు. 2, 3 వికెట్లు పడిన తర్వాత కూడా భారత్.. పిచ్‌ను సరిగా అర్థం చేసుకోలేదని అన్నాడు. ఇది సాధారణ వాంఖడే పిచ్ కాదని ముందే గ్రహించి ఉంటే వికెట్లు కాపాడుకుంటూ చివర్లో దూకుడుగా ఆడేవారని, అలా చేసి ఉంటే మరో 2030 పరుగులు వచ్చేవని అభిప్రాయపడ్డాడు. 161 పరుగులు కూడా డిఫెండ్ చేయగలిగే స్కోరేనని, శనివారం రాత్రి భారత్ అదే చేసిందని చెప్పాడు. మ్యాచ్ అనంతరం సూర్య మాట్లాడాడు. గతేడాది తనకు చాలా కష్టంగా గడిచిందని చెప్పాడు. దక్షిణాఫ్రికా సిరీస్ తర్వాత కొంతకాలం క్రికెట్ నుంచి మానసికంగా దూరంగా ఉండటం.. తను మళ్లీ ఫామ్‌లోకి రావడానికి దోహదపడిందని తెలిపాడు.

# శ్రీలంక కెప్టెన్ ప్రపంచ రికార్డు



శ్రీలంక టీ20 జట్టు కెప్టెన్ దసున్ షనక ఓ చెత్త రికార్డు విషయంలో ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ప్రపంచకప్‌లో ఇవాళ (ఫిబ్రవరి 8) ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో డకౌటైన అతను.. అంతర్జాతీయ టీ20 క్రికెట్ చరిత్రలో అత్యధిక డకౌట్లైన (113 ఇన్నింగ్స్‌ల్లో 16 సార్లు) ఆటగాడిగా అవతరించాడు. షనకకు ముందు ఈ రికార్డు జప్పి బిమెన్యిమనా (62 ఇన్నింగ్స్‌ల్లో 15) పేరిట ఉండేది. షనక, జప్పి తర్వాతి స్థానాల్లో పాల్ స్టిర్లింగ్ (158 మ్యాచ్‌ల్లో 14) ఉన్నాడు. మ్యాచ్ విషయానికొస్తే.. టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్న ఐర్లాండ్ ఆదిలో శ్రీలంక ఆటగాళ్లను బాగానే కట్టడి చేసింది. తొలి 10 ఓవర్లలో ఆ జట్టు 3 వికెట్లు కోల్పోయి 68 పరుగులు మాత్రమే చేయగలిగింది. 16 ఓవర్ల వరకు కూడా పరిస్థితి ఇలాగే కొనసాగింది. ఆ సమయానికి 4 వికెట్ల నష్టానికి 104 పరుగులు మాత్రమే చేయగలిగింది. అయితే ఆ ఓవర్ తర్వాత ఐర్లాండ్ బౌలర్లు లయ తప్పారు. అనవసర వైడ్లు, ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. ఫలితంగా చివరి 4 ఓవర్లలో లంక ఆటగాళ్లు 59 పరుగులు పిండుకున్నారు. దీంతో ఆ జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. ఐరిష్ బౌలర్లలో జార్జియా డాక్రెల్ (40172) అద్భుతంగా బౌలింగ్ చేశాడు. మార్క్ అదైర్ (40331), గెరాత్ డెలానీ (40241) కూడా పర్వాలేదనిపించారు. మాథ్యూ హంఫ్రేస్ (40440), బ్యారీ మెక్ కార్తీ (30402) ధారాళంగా పరుగులు సమర్పించుకున్నాడు. లంక ఇన్నింగ్స్‌లో కుసాల్ మెండిస్ (56 నాటౌట్) టాప్ స్కోరర్ కాగా.. ఆఖర్లో కుసాల్ మెండిస్ (44) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. మిగతా ఆటగాళ్లలో నిస్సంక 24, కమిల్ మిషారా 14, పవన్ రత్నాయకే 5, వెల్లాలగే 10, హసరంగ ఒక్క పరుగు చేయగా.. షనక డకౌటయ్యాడు.

## పాక్ నిర్ణయం ఆశ్చర్యం కలిగించింది



టీ20 ప్రపంచకప్‌లో భారత్‌తో ఆడకూడదని పాకిస్థాన్ నిర్ణయించుకోవడం ఆశ్చర్యం కలిగించిందని టీమ్ఇండియా మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ అన్నాడు. ''ప్రపంచకప్‌లో ఒక మ్యాచ్ ఆడకపోవడం ఏంటి? పాకిస్థాన్ తీసుకున్న ఈ నిర్ణయం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఈ టోర్నీలో ప్రతి పాయింట్ చాలా కీలకం'' అని దాదా పేర్కొన్నాడు. అమెరికాతో తొలి మ్యాచ్‌లో బ్యాటింగ్‌లో తడబడినప్పటికీ.. భారత్ దూకుడుగానే ఆడాలని గంగూలీ సలహా ఇచ్చాడు. ''టీ20 క్రికెట్లో మొదటి బంతి నుంచి బాదుతూనే ఉండాలి. భారత్‌లో నాణ్యమైన ప్లేయర్లు ఉన్నారు. చాలా నెలల నుంచి వాళ్లు దూకుడుగానే ఆడుతున్నారు. బాదే క్రమంలో ఒక్కోసారి తడబడే అవకాశాలుంటాయి. అమెరికాపై అదే జరిగింది. అలా అని జట్టు ప్రణాళికలను మార్చుకోకూడదు. ఎప్పటిలాగే ఆడాలి. భారత జట్టు చాలా బలంగా ఉంది. అన్ని విభాగాల్లో సమతూకంగా కనిపిస్తోంది. ప్రపంచకప్ సాగేకొద్దీ జట్టు జోరు అందుకుంటుంది'' అని గంగూలీ చెప్పాడు. సూర్యకుమార్ మ్యాచ్ విన్నర్ అని మరోసారి నిరూపించుకున్నాడని దాదా చెప్పాడు. ''న్యూజిలాండ్‌తో సిరీస్‌లో రాణించి.. ఆత్మవిశ్వాసంతో ప్రపంచకప్‌కు వచ్చాడు సూర్యకుమార్. అమెరికాపై అతడు స్వేచ్ఛగా ఆడాడు. కొన్ని అద్భుతమైన షాట్లు కొట్టాడు. తాను మ్యాచ్ విన్నర్‌ని అని అతడు నిరూపించుకున్నాడు'' అని గంగూలీ చెప్పాడు.

## దేవికకు మరో టైటిల్



భారత యువ షట్లర్ దేవిక సిహాగ్ వరుసగా రెండో టైటిల్ ఖాతాలో వేసుకుంది. గత వారం థాయ్‌లాండ్ మాస్టర్స్ విజేతగా నిలిచిన దేవిక.. ఇప్పుడు అజర్‌బైజాన్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో టైటిల్ నెగ్గింది. ఆదివారం ఫైనల్లో ఆమె 21 10, 2113తో నవ్య కందేరిపై గెలిచింది. సాత్విక్ రెడ్డి, రాధిక శర్మ జోడీ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ సాధించింది. ఈ జంట 2422, 10 21, 2422తో మిహాల్ టొమిక్, ఆండ్జెలా విట్‌మన్ ద్వయంపై గెలిచింది.

## ఆసియా షూటింగ్.. మెరిసిన ఇషా

**–వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో స్వర్ణాలు**

ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో హైదరాబాదీ షూటర్ ఇషా సింగ్ సత్తా చాటింది. బుధవారం ప్రారంభమైన ఈ టోర్నీలో మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో పసిడి పతకం గెలిచిన ఇషా.. టీమ్ విభాగంలోనూ స్వర్ణాన్ని దక్కించుకుంది. వ్యక్తిగత విభాగం ఫైనల్లో ఇషా (239.8) అగ్రస్థానంలో నిలిచింది. చైనీస్ తైపీ అమ్మాయిలు చెంగ్ యెన్ చెంగ్ (235.4) యూ అయ్ వెన్ (217.7) వరుసగా రజత, కాంస్య పతకాలు అందుకున్నారు. డబుల్ ఒలింపిక్ పతక విజేత మను బాకర్ ఏడో స్థానంలో నిలిచింది. మహిళల టీమ్ విభాగంలో సురుచి (576), ఇషా (575), మను (575)లతో కూడిన భారత జట్టు (1726) పసిడి కైవసం చేసుకుంది. వియత్నాం (1713) రజతం, చైనీస్ తైపీ (1711) కాంస్యం గెలిచాయి. పురుషుల 10 మీటర్ల పిస్టల్‌లో సామ్రాట్ రాణా కాంస్యం నెగ్గాడు. ఫైనల్లో 220.3 పాయింట్లతో అతడు మూడో స్థానంలో నిలిచాడు. వెచ్నికోవ్ (ఉజ్బెకిస్థాన్, 242), రకీమ్‌జాన్ (కజకిస్థాన్, 241) తొలి రెండు స్థానాలు సాధించారు. టీమ్ విభాగంలో సామ్రాట్ (581), శ్రవణ్ (578), వరుణ్ తోమర్ (573)లతో కూడిన భారత్ బృందం (1732) రెండో స్థానంలో నిలిచింది. ఉజ్బెకిస్థాన్ (1732) కూడా అన్నే పాయింట్లు సాధించినా.. మధ్య వృత్తానికి సమీపంగా ఎక్కువ పదులు స్కోరు చేయడంతో స్వర్ణాన్ని గెలుచుకుంది. కజకిస్థాన్ (1731) మూడో స్థానంలో నిలిచింది.